## ఢిల్లీలో కలకలం.. ఓ ఇంట్లో
## రూ.262 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

దేశ రాజధాని ఢిల్లీ లో భారీగా డ్రగ్స్ పట్టుబడటం కలకలం రేపుతోంది. ఓ ఇంట్లో కోట్ల రూపాయల విలువ చేసే మెథాంఫెటమైన్‌ను ఎన్‌సీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశారు.'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్'పేరుతో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో ఛత్రపుర్‌లోని ఓ ఇంట్లో రూ. 262 కోట్ల విలువైన 329 కిలోల మెథాంఫెటమైన్)ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎన్‌సీబీ అధికారులు వెల్లడించారు. ఈ అక్రమ రవాణా ముఠాకు విదేశీ ఆధారిత కింగ్‌పిన్‌తో సంబంధాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. విదేశీ హ్యాండ్లర్‌ల సూచనలతో నిందితులు డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తున్నారని.. వారితో సంప్రదింపుల కోసం ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ యాప్‌లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :233 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 25-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుంది.. మాజీ మంత్రికి కవిత వార్నింగ్



హైదరాబాద్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన తండ్రి వయసు వారని ఇన్నాళ్లు తాను ఏమి అనలేదని కానీ ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడితే ఊరుకునేది లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తనను ఉద్దేశించి పుచ్చువంకాయ, సచ్చు వంకాయ అని నిరంజన్ రెడ్డి మాట్లాడుతున్నారట.. ఇన్నాళ్లు మీ వయసుకు గౌరవించాను. ఇంకో సారి నాపై పిచ్చి పిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుందని ఘాటుగా హెచ్చరించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఇవాళ వనపర్తిలో మీడియాతో మాట్లాడిన కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. మనుషులను పెట్టించి నాపై మాట్లాడిస్తున్నా చాలా రోజులుగా మౌనంగా ఉన్నాను. నా పని నేను చేసుకుంటూ వెళ్తుంటే ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు. ఒళ్లు దగ్గర పెట్టుకుని చేసిన ఆరోపణలపై సమాధానాలు ఇవ్వాలన్నారు. నా గురించి మీకేం తెలుసని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అవినీతి, అక్రమాల వల్ల వనపర్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నిరంజన్ రెడ్డి అవినీతి గురించి కేసీఆర్ కు తెలియదా? లేదా ఈ అవినీతి కేసీఆర్ వరకు వెళ్లకుండా హరీశ్ రావు కాపాడారా అని నిలదీశారు. నిరంజన్ రెడ్డి అవినీతి కేసీఆర్ కు ఇప్పటి వరకు తెలియదనే తాను అనుకుంటున్నానని ఇవాళ మీడియా ముఖంగా నిరంజన్ రెడ్డి అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తున్నానని ఇక్కడ ఏ చిన్న పిల్లాడిని కదిలించినా నిరంజన్ రెడ్డి అరాచకలు చెబుతున్నారని అన్నారు.

నిరంజన్ రెడ్డి లాంటి నాయకులను ప్రజలమీద రుద్ది ఉద్యమకారులను ఇబ్బంది పెట్టడం ఎందుకని కవిత ప్రశ్నించారు. నిరంజన్ రెడ్డి లాంటి మనుషులు రాజకీయాల్లో ఉండకూడదన్నారు. నిరంజన్ రెడ్డి బీసీలు, ఉద్యమకారులపై పెట్టిన కేసుల గురించి బాధితులు చెప్పుకుంటూ బాధితులు ఏడుస్తున్నారన్నారు. ఒక్కసారి మంత్రి అయిన నిరంజన్ రెడ్డి మూడు ఫామ్ హౌస్ లు కట్టుకున్నారని ఇందులో అసైండ్ భూములు కూడా ఉన్నాయని, కృష్ణా నది కాలువ ఆయన ఫామ్ హౌస్ లోనుంచి వెళ్తోందని చెబుతున్నారన్నారు. ఈ బీఆర్ఎస్ తో తనకు సంబంధం లేదని అయినా ఉద్యమాకారులు ఆ పార్టీలో ఉండలేక మింగలేక చస్తున్నారని చెప్పారు.

**హరీశ్ రావు మనిషి కాబట్టే చర్యలు లేవు:**

నిరంజన్ రెడ్డి స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని కాలబెడుతుంటే కూడా చూస్తూ ఉండిపోయారట. ఈ విషయం నిజంగా కేసీఆర్ కు తెలిసి కూడా మౌనంగా ఉంటే మాత్రం ఇది వంద శాతం తప్పు అవుతుందన్నారు. ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని ఇంక ఘోరంగా మిమ్మల్ని ఓడించాల్సిందన్నారు. ప్రజా సమస్యలపై నేను మాట్లాడుతుంటే మీకెందుకు భయం అవుతోందని మండిపడ్డారు. భూదహానికి, ధనదాహానికి హద్దు ఉండాలి కదా అన్నారు. నిరంజన్ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మీ మధ్య ఉన్న అవగాహన ఏమిటి అని ప్రశ్నించారు. హరీశ్ రావు మనిషి కావడం వల్లే నిరంజన్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తాను బలంగా నమ్ముతున్నానన్నారు.

## 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ,53వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుత సీజేఐ బీఆర్ గవాయ్ పదవీకాలం ఆదివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ నేడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చేత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు అంటే 15 నెలల పాటూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, పియూష్ గోయల్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా పలువురు ఎంపీలు పాల్గొన్నారు.సూర్యకాంత్‌ను సీజేఐగా నియమించాలని జస్టిస్ గవాయ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. భారత రాజ్యాంగంలోని అధికారాలను వినియోగించి జస్టిస్ సూర్యకాంత్‌ను సీజేఐగా నియమించడానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. హర్యానాలోని హిస్సార్ జిల్లాకు చెందిన సూర్యకాంత్ ఓ మధ్య తరగతి కుటుంబంలో 1962 ఫిబ్రవరి 10న జన్మించారు. కురుక్షేత్ర యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రం మాస్టర్స్ డిగ్రీలో టాపర్‌గా నిలిచారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్ హర్యానా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు.హర్యానాకు చెందిన జస్టిస్ సూర్యకాంత్ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. అంతకుముందు ఆయన పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రెండు దశాబ్దాలుగా వివిధ ధర్మాసనాల్లో పనిచేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. న్యాయపరమైన తర్కానికి, సామాజిక న్యాయంపై బలమైన ప్రాధాన్యతకు పేరుగాంచిన ఆయన రాజ్యాంగ ధర్మాసనంలోని అనేక విషయాలలో, పాలన, పర్యావరణ సమస్యలు, రాజ్యాంగ వివరణలపై కీలక తీర్పులలో భాగంగా ఉన్నారు. 15 నెలల పాటు సీజేఐగా ఉండనున్న ఆయన ఎన్నికల సంస్కరణలు, క్రిమినల్ జస్టిస్, డిజిటల్ ప్రైవసీ వంటి ప్రధాన రాజ్యాంగ అంశాలకు సంబంధించిన కేసులలో భాగస్వామి కానున్నారు.

## మమతా బెనర్జీ ఈ సారి కష్టమే !



కోల్ కతా :బీహార్‌లో మరోసారి గెలిచిన తర్వాత మా టార్గెట్ బెంగాల్ అని ప్రధాని మోదీ, అమిత్ షా సవాల్ చేశారు. మరో ఆరు నెలల్లో అంటే వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగనున్నాయి.మమతా బెనర్జీ ఇప్పటికి పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్నారు. వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. కానీ నాలుగోసారి మాత్రం అంత తేలికగా కనిపించడం లేదు. ఎందుకంటే పదిహేనేళ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు రాజకీయం మారిపోయింది. అప్పట్లో కమ్యూనిస్టులు వర్సెస్ మమతా బెనర్జీ అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు కమ్యూనిస్టుల ప్లేస్‌లో బీజేపీ వచ్చి చేరింది.

**కమ్యూనిస్టుల్ని నిర్వీర్యం చేసి బీజేపీని పెంచిన మమతా బెనర్జీ**

బెంగాల్ రాజకీయంలో భారతీయ జనతా పార్టీ ఎదిగిందంటే దానికి కారణం మమతా బెనర్జీనే. బెంగాల్ లో కమ్యూనిస్టులు దశాబ్దాల తరబడి అధికారంలో ఉన్నారు. పైకి ఏం చెప్పినా బెంగాల్ లో వారు గ్రామాల్లో గ్రూపుల గొడవలు, హత్యా రాజకీయాల ద్వారా ఎక్కువగా అధికారంలో ఉన్నారని నమ్ముతారు. అలాంటి రాజకీయాలను ఎదిరించి మమతా బెనర్జీ విజయం సాధించారు. కమ్యూనిస్టు పార్టీపై వ్యతిరేకతతో ప్రజలు మమతా బెనర్జీని గెలిపించారు. ఆ తర్వాత ఆమె కమ్యూనిస్టుల చూపిన దారిలో తాను రెండాకులు ఎక్కువే చదివానన్నట్లుగా రాజకీయాలు చేసి క్రమంగా వారిని నిర్వీర్యం చేయడం ప్రారంభించారు. అదే సమయంలో బీజేపీ ఎదుగుతుందన్న సంగతిని గుర్తించలేదు.

**నిలువ నీడ లేక బీజేపీ పంచన చేరిన కమ్యూనిస్టులు**

కమ్యూనిస్టు భావజాలానికి, బీజేపీకి అసలు పొంతనే ఉండదు. కానీ రాజకీయం అంటే.. భావజాలం ఎప్పటికప్పుడు మారిపోవడమే. దానికి తగ్గట్లుగానే పెద్ద ఎత్తున కమ్యూనిస్టులు దాడులకు గురవుతూంటే.. రక్షణ కోసం బీజేపీలో చేరిపోవడం ప్రారంభించారు. బెంగాల్లో ముస్లింలు కూడా ఎక్కువే. అయితే వారిలోనూ కమ్యూనిస్టులు ఎక్కువ. వర్గ పోరాటాల్లో కొంత మంది బీజేపీకి మద్దతుగా ఉంటున్నారు. పదేళ్ల కిందటి వరకూ బీజేపీ అత్యంత బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఒకటి బెంగాల్. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటు బ్యాంక్ కేవలం 10 శాతం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అది 40 శాతానికి చేరుకుంది. 2021 అసెంబ్లీలో 38 శాకం , 2024 లోక్‌సభ ఎన్నికలలోనూ అంతే పర్సంటేజీలో ఓట్లు సాధించి బలంగా నిలిచింది

**బీజేపీ ఈ సారి మిస్ కావాలనుకోవడం లేదు !**

బీజేపీలో ఇప్పుడు పెద్ద నేతలు ఉన్నారు. మమతా బెనర్జీ నీడలో ఎదిగిన నేతలే ఇప్పుడు బీజేపీలో ఉన్నారు. వారందరికీ మమతా బెనర్జీని ఎలాగైనా పదవి నుంచి దింపాలని టార్గెట్. అందుకే మోడీ, షా మార్గదర్శకత్వంలో వారు తమ పని ప్రారంభించారు. రాష్ట్రాన్ని 6 రాజకీయ జోన్లుగా విభజించి.. ప్రతి జోన్‌కు ఒక్కొక్క కీలక నేతకు బాధ్యతలు అప్పగించారు. వచ్చే ఆరు నెలలు వారు ఈ పని మీదనే ఉంటారు. బీజేపీకి ప్రతి ఓటర్ ను చేరుకునే ప్రత్యేకమైన యంత్రాంగం ఉంటుంది. దాన్ని యాక్టివేట్ చేస్తున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో పట్టు, ముస్లింలపైనే దీదీ ఆశలు**

కమ్యూనిస్టులను తరిమేసి గ్రామ స్థాయిలో పట్టు పెంచుకున్నారు మమతా బెనర్జీ. ఎవరైనా ఎదురుతిరిగితే దాడులు చేస్తారు. దాంతో పాటు ముప్పై శాతం వరకూ ఉన్న ముస్లింలలు గట్టి ఓటు బ్యాంకుగా ఉన్నారు. వారిపై నమ్మకంతో మమతా బెనర్జీ ధీమాగా ఉన్నారు. కానీ పదిహేనేళ్ల పాలన ప్రజా వ్యతిరేకత.. ఆమెకు పెను గండంగా మారనుంది. అందుకే.. ఈ సారి బీజేపీ నుంచి ఆమె ఓటమి తప్పించుకోవడం సాధ్యం కాదన్న వాదన వినిపిస్తోంది. బీజేపీని ఎదుర్కొని విజయం సాధిస్తే.. ఆమె ఇమేజ్ దేశంలో మరింతగా పెరుగుతుంది.

## రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై పాక్ ఉలికిపాటు



ఇస్లామాబాద్: భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాజాగా పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ గురించి చేసిన వ్యాఖ్యలపై పాకిస్తాన్ తీవ్రంగా స్పందించింది. సోమవారం పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. భవిష్యత్తులో సింధ్ భారతదేశానికి తిరిగి చెందవచ్చంటూ రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు భ్రాంతితో కూడినవని, ఇది విస్తరణవాద, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన కిందకు వస్తాయని పేర్కొంది. రాజ్‌నాథ్ సింగ్ మాటలు హిందూత్వ విస్తరణవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆరోపించింది. ఇటువంటి వ్యాఖ్యలు వాస్తవాలను సవాలు చేస్తున్నాయని, రాష్ట్రాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తాయని పాకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సింధ్ కమ్యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. సింధ్‌తో భారతదేశానికి ఉన్న శాశ్వత సాంస్కృతిక సంబంధాలపై దృష్టి సారించిన ఆయన, ఈ ప్రాంతం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నప్పటికీ, దాని నాగరికత బంధం భారత్‌తో చెక్కుచెదరకుండా ఉందని అన్నారు. 'నేడు, సింధ్ భూమి భారతదేశంలో భాగం కాకపోవచ్చు, కానీ నాగరికత ప్రకారం, సింధ్ ఎల్లప్పుడూ భారతదేశంలో భాగంగానే ఉంటుంది' అని అన్నారు. రాజకీయ సరిహద్దులు తాత్కాలికమే అయినప్పటికీ, సాంస్కృతిక గుర్తింపు, ఉమ్మడి వారసత్వం చాలా కాలం పాటు ఉంటాయని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్ నేతలతో కేటీఆర్ భేటీ.. జీహెచ్ఎంసీ ఎన్నికలపై దిశానిర్దేశం



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ నేతలతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. మంగళవారం జరుగనున్న గ్రేటర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు వివిధ అంశాలపై కేటీఆర్ మార్గదర్శనం చేశారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ఎలాంటి అవినీతికి తావు లేకుండా అద్భుతంగా పదవీకాలం పూర్తి చేసుకోబోతున్నారని పార్టీ తరపున వారికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా రెండోసారి జీహెచ్ఎంసీలో గెలిచిన తర్వాత కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతమైన సేవలను అందించిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రజలు పార్టీకి ప్రతిపక్షంగా బాధ్యత ఇచ్చిన తర్వాత హైదరాబాద్ నగరంలో ఉన్న కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తీరును అభినందించారు. మొన్నటికి మొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్పొరేటర్లు బాధ్యతాయుతంగా ఎన్నికలను పోరాడిన విధానంపై అభినందనలు తెలిపారు. పార్టీ వెంటే నిలబడిన ప్రతి ఒక్క కార్పొరేటర్‌కి భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు భవిష్యత్తులో జరిగే ఎన్నికను తమ ఎన్నికగా తీసుకొని పార్టీ అందరినీ తిరిగి గెలిపించుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్లకి రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు ఎప్పుడు పెట్టినా సిద్ధంగా ఉండాలని సూచించారు. కౌన్సిల్ సమావేశంలో బల్దియాలోని సమస్యలు ప్రస్తావించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక భూముల అమ్మకంపై నిలదీయాలని సూచించారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఆందోళన కలిగిస్తున్న సైబర్ నేరాలు




హైదరాబాద్,గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్న సైబర్ నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గత నెల రోజులుగా.. వందలాది వాట్సాప్ గ్రూపులపై సైబర్ కేటుగాళ్లు దాడి చేసి, యూజర్లను లక్ష్యంగా చేసుకున్నారు. 'టీమ్ SBI' పేరుతో నకిలీ వాట్సాప్ గ్రూపులు సృష్టించి, కేవైసీ అప్‌డేట్ పేరుతో సందేశాలు పంపడం ద్వారా ఖాతాదారులను మోసం చేస్తున్నట్లు అధికారుల దర్యాప్తులో బయటపడింది. ఏపీకే ఫైళ్లు పంపించి అవి ఇన్‌స్టాల్ చేయమని కోరడం ద్వారా యూజర్ల మొబైల్ ఫోన్లపై పూర్తి నియంత్రణ సాధిస్తున్నారని పోలీసులు హెచ్చరించారు. అలాగే మరోపక్క ఆధార్ అప్‌డేట్ పేరుతో కూడా కొత్త మోసాలు వెలుగుచూస్తున్నాయి. "ఈ రాత్రి నుంచి మీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అవుతుంది" అంటూ బెదిరింపులతో లింకులు పంపి, ఖాతాదారులను క్లిక్ చేయించే ప్రయత్నాలు పెరిగాయి.లింకులు ఓపెన్ చేసిన వారికి మొబైల్‌పై పూర్తి యాక్సెస్ లభించడంతో, పలు బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లిన ఘటనలు నమోదయ్యాయి. ఈ మోసాలపై పలువురు 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కి, స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం. ప్రజలు ఏ అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని, అధికారిక వెబ్‌సైట్లు, బ్రాంచ్‌ల ద్వారానే బ్యాంకింగ్ అప్‌డేట్‌లు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపులలో వచ్చే APK ఫైల్స్ ఎవరు ఓపెన్ చేయవద్దని వాటి ద్వారనే అత్యధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని అధికారులు అలర్ట్ జారీ చేశారు.

## అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్‌నగర్: తలసాని




హైదరాబాద్, నవంబరు 24 : అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్‌నగర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఇవాళ (సోమవారం) సనత్‌నగర్‌లోని బీకే గూడలో గల సీనియర్ సిటీజన్స్ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పైబడిన 34 మంది, 70 సంవత్సరాలు పైబడిన 32 మంది సీనియర్ సిటీజన్స్‌ను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తమ వయసు సైతం లెక్క పెట్టకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా సీనియర్ సిటీజన్స్ నిలుస్తున్నారని ప్రశంసించారు. 2014లో తాను సనత్ నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సీనియర్ సిటిజన్ కౌన్సిల్‌కు సౌకర్యార్థం కార్యాలయం నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో గడపాల్సిన సమయంలో సమాజానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ఒక కమిటీగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమాలకు తన సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని, ఇక ముందు కూడా కొనసాగిస్తానని స్పష్టం చేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్.సనత్‌నగర్ నియోజకవర్గంలో 2014 తర్వాతనే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపెట్టామని చెప్పుకొచ్చారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రిగా చేసిన మర్రి చెన్నారెడ్డి హయాంలో కూడా సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు జరగలేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షులు పార్థసారధి, మానిక్ రావ్ పాటిల్, సభ్యులు అనంతరెడ్డి, కృష్ణ దేవ్‌గౌడ్, సాయి, నాయకులు కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### చందూరు మైనార్టీ గురుకులంలో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య..

నిజామాబాద్: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని గురుకులాలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లా చందూరు మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల హాస్టల్‌లో విద్యార్థి బలవన్మరణం చెందారు. పదో తరగతి విద్యార్థి షేక్ మూస హాస్టల్‌లో ఉరివేసుకుని తనువు చాలించాడు. శుక్రవారం ఆధార్ అప్‌డేట్ కోసం నిజామాబాద్‌లోని ఇంటికి వెళ్లిన మూస.. ఆదివారం సాయంత్రం హాస్టల్‌కు తిగివచ్చాడు. ఈ క్రమంలో రాత్రి విద్యార్థులంతా పడుకున్నాక హాస్టల్‌లోని రేకుల షెడ్డు రాడ్‌కు తువాలుతో

# సంపాదకీయం

**మంగళవారం 25-11-2025**

## గోప్యతకు రక్షణ గోడ

వ్యక్తిగత సమాచార భద్రతపై కీలక ముందడుగు పడింది. మన దేశంలో డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టాన్ని 2023లోనే చేశారు. దానికి సంబంధించి పూర్తిస్థాయి నిబంధనలు తాజాగా అధికారికంగా అమల్లోకి వచ్చాయి. ఐరోపా సమాఖ్య తరహాలో డేటా నియంత్రణకు ప్రత్యేక చట్టం అమలు చేస్తున్న దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరడం విశేషం. రోజూ కోట్ల సంఖ్యలో పౌరులు ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా వేదికలు, అమెజాన్ లాంటి ఈ-కామర్స్ పోర్టళ్లు, మొబైల్ యాప్‌లు, ప్రభుత్వ వెబ్‌సైట్లు... ఇంకా అనేక డిజిటల్ మార్గాల్లో తమ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకుంటున్నారు. ఈ ప్రక్రియలో సమాచార 'యజమాని'గా పౌరుడి హక్కులనూ, సమాచారాన్ని వినియోగించడంలో ఆయా సంస్థల బాధ్యతలనూ డీపీడీపీ చట్టం స్పష్టంగా పేర్కొంటుంది. సేకరించిన సమాచారాన్ని నిల్వ చేయడం, నిర్వహించడంలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించాలో కూడా నిర్దేశిస్తుంది. ఒక వ్యక్తిని గుర్తించడానికి అవకాశమిచ్చే ఏ సమాచారమైనా ఈ చట్టం పరిధిలోకి వస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి పేరు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ, ఆధార్, పాన్ నంబర్లు, వేలిముద్రలు వంటి బయోమెట్రిక్ సమాచారం, సోషల్ మీడియా పోస్టులు మొదలైనవన్నీ వ్యక్తిగత సమాచారం కిందకే వస్తాయి. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సృష్టికర్తగా, డేటా వినియోగ మార్కెట్‌గా ఎదుగుతున్న ప్రస్తుత సమయంలో ఆ ప్రయోజనాలు అన్ని వర్గాలకూ అందాలి. పౌరుల వ్యక్తిగత సమాచారం సురక్షితంగా ఉండాలి. డేటా నియంత్రణ వల్ల కొత్త ఆవిష్కరణలకు భంగం కలగకూడదు... ఇవీ ఈ చట్టం ప్రధాన ఉద్దేశాలు.

ప్రత్యేక హక్కుల కల్పన

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుల్లో భాగమని పేర్కొంటూ 2017లో జస్టిస్ పుట్టస్వామి కేసులో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. ఆ క్రమంలో వచ్చిందే డీపీడీపీ చట్టం. దీన్ని అమల్లోకి తేవడం ద్వారా పౌరులకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించినట్లయింది. తమకు సంబంధించి ఏ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరు తీసుకుంటున్నారో తెలుసుకోగలగడం, దానికి అంగీకారం తెలపడం, సమ్మతిని ఉపసంహరించుకోవడం, సమాచారాన్ని సరిదిద్దమని లేదా తొలగించమని అడగడం, ఫిర్యాదులపై నిర్ణీత సమయంలోపు స్పందించడం మొదలైన హక్కులు పౌరులకు సంతరించాయి. డేటాకు సంబంధించి ఆయా సంస్థలు పౌరుల సమ్మతి పొందే క్రమంలో- ఆ వ్యక్తులు ఏ సమాచారం ఇస్తున్నారు, అది ఏ అవసరం కోసం, ఎంతకాలం నిల్వ చేస్తారు లాంటి వివరాలను స్పష్టంగా, సులభమైన రీతిలో, భారతీయ భాషల్లో అందుబాటులో ఉండాలి. డేటా వినియోగానికి సంబంధించి పౌరులు ఎప్పుడైనా సరే తామిచ్చిన సమ్మతిని వెనక్కి తీసుకోవచ్చు. సమాచారం పంచుకునే క్రమంలో పౌరులు అనేక వెబ్‌సైట్లలో, యాప్‌లలో అనేక రకాలుగా తమ 'సమ్మతి'ని తెలుపుతుంటారు. వీటన్నింటినీ సులభంగా ఒకే దగ్గర చూసుకునే, మార్చుకునే వెసులుబాటు కోసం- సమాచారం సేకరించిన సంస్థకు, పౌరుడికి మధ్య తటస్థ అంగీకార నిర్వహణ (కన్సెంట్ మేనేజర్) వ్యవస్థను డీపీడీపీ ఏర్పరుస్తోంది. పౌరుల కోసం ఇలాంటి 'ఏక గవాక్ష' సౌలభ్యం ఇతర ఏ దేశాల్లోనూ లేకపోవడం గమనార్హం. వ్యక్తిగత సమాచారం పొరపాటున లీకయ్యే సందర్భాల్లో సంస్థలు నిర్దిష్ట సమయంలోపు ఆ విషయాన్ని సంబంధిత వ్యక్తులకు, డేటా రక్షణ ప్రాధికార సంస్థకు తెలియజేయాల్సి ఉంటుంది. పిల్లలకు సంబంధించిన సమాచార గోప్యత ఈ చట్టంలో మరో ముఖ్యమైన విషయం. 18 ఏళ్ల లోపు పిల్లల సమాచారం ప్రాసెస్ చేయాలంటే తల్లిదండ్రుల తరఫున స్పష్టమైన అంగీకారం తప్పనిసరి. ఆన్‌లైన్‌లో పిల్లల అలవాట్లను గమనించే పోకడలు, వారిని లక్ష్యంగా చేసుకుని చేసే ప్రకటనలను నియంత్రించడం కూడా ఈ చట్టం లక్ష్యాల్లో ఒకటి. భారీ స్థాయిలో డేటాను సేకరించే సోషల్ మీడియా కంపెనీలు, టెక్ దిగ్గజ సంస్థలను ఈ చట్టం ప్రత్యేకంగా పరిగణిస్తుంది. స్వతంత్ర ఆడిట్లు, అధ్యయనాలు, కట్టుదిట్టమైన సైబర్ భద్రతా చర్యలు వంటి కఠినమైన బాధ్యతలు ఉంటాయి.

సురక్షిత డిజిటల్ భవితకు...

సాంకేతికత, గోప్యతతో ముడిపడిన విషయం కావడంతో డీపీడీపీ చట్టంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నాస్కామ్ వంటి సంస్థలు చట్టాన్ని స్వాగతించినా, నిబంధనల అమలుతో చిన్న సంస్థలు, స్టార్టప్‌లపై వ్యయభారం పెరుగుతుందన్నాయి. చట్టంలో ఉపయోగించిన 'సరైన' భద్రతా ప్రమాణాలు, 'సముచిత' సాంకేతిక చర్యలు లాంటి పదాలపై స్పష్టత కావాలని కోరాయి. ప్రభుత్వ విభాగాలకు ఎక్కువ మినహాయింపులు ఇచ్చారనీ, సమాచార హక్కు చట్టాన్ని బలహీనపరిచే అంశాలున్నాయని, చట్ట ప్రకారం ఏర్పాటైన డేటా రక్షణ బోర్డుకు తగిన స్వతంత్రత లేదంటూ కొన్ని పౌరసమాజ సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. పిల్లల విషయంలో తల్లిదండ్రుల సమ్మతి వంటి నిబంధనల అమలు మనలాంటి దేశంలో సవాలే అంటున్నారు నిపుణులు. డీపీడీపీ చట్టం వల్ల టెక్ సంస్థలపై బాధ్యతలు పెరిగిన మాట వాస్తవం. అయితే, మెరుగైన డేటా రక్షణ విధానాలు, పారదర్శకమైన 'సమ్మతి' ప్రక్రియ, అంతర్గత నియంత్రణలు వంటివి వినియోగదారుల్లో విశ్వాసాన్ని పెంచేందుకు దోహదం చేస్తాయి. ఈ క్రమంలో దీర్ఘకాలంలో ఆయా సంస్థల పురోగతికి తోడ్పడే అవకాశం ఉంది. వస్తుసేవలను రూపొందించే క్రమంలోనే గోప్యతను దృష్టిలో పెట్టుకోవాలనే దృక్పథం ఈ చట్టం ద్వారా మరింతగా బలపడనుంది. డేటా రక్షణ చట్టం, నిబంధనలు రావడం ఒక ఎత్తయితే, ప్రజానీకంలో సైబర్ భద్రతపై అవగాహన ఇంకా పెరగాల్సి ఉంది. డిజిటల్ కార్యకలాపాల్లో అప్రమత్తంగా ఉండటం, వెబ్‌సైట్లు, యాప్‌లలో ఎలాంటి సమాచారం, అనుమతులు ఇస్తున్నారో సరిచూసుకోవడం, కఠిన పాస్‌వర్డ్‌లు వాడటం, అపరిచిత లింకులను క్లిక్ చేయకపోవడం వంటివి చాలా ముఖ్యం. ప్రభుత్వం, టెక్నాలజీ సంస్థలు, పౌర సమాజం, ప్రజలు కలిసి పనిచేస్తే- భారత డిజిటల్ భవిత మరింత ఉజ్జ్వలంగా, సురక్షితంగా రూపుదిద్దుకుంటుంది.

## బిల్లుల ఆమోదంలో గవర్నర్ ఆలస్యం న్యాయమేనా? గవర్నర్ పాత్రకు సుప్రీం స్పష్టత..



న్యూఢిల్లీ,భారత రాజ్యాంగం సమాఖ్య వ్యవస్థను బలపరిచే ప్రధాన స్తంభాలలో ఒకటి రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం. ఈ ప్రక్రియ ప్రజాస్వామ్య సంకల్పానికి కీలకమైన దశ. అయితే గత కొన్నేళ్లుగా కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం, స్పష్టమైన కారణాలు లేకుండా ఆలస్యం చేయడం వంటి రాజ్యాంగపరంగా వివాదాస్పద పరిస్థితులు పెరిగాయి. దీంతో కేంద్ర%-%రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య స్ఫూర్తి, ప్రజల సార్వభౌమాధికారంపై తీవ్ర ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో గవర్నర్, రాష్ట్రపతి బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి కాలపరిమితిని విధించేందుకు న్యాయ స్థానాలకు అధికారం ఉందా అని తెలుసు కునేందుకు ఆర్టికల్ 143 కింద భారత రాష్ట్రపతి కోరిన సుప్రీంకోర్టు సలహా తీర్పు ఒక చారిత్రక మలుపు అయింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయితో కూడిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, నవంబర్ 20న ఈ రిఫరెన్స్‌పై తన సలహా తీర్పును వెలువరించింది. ఈ తీర్పు, రాజ్యాంగంలోని అధికారాల విభజన సిద్ధాంతాన్ని గౌరవిస్తూ, బిల్లులకు ఆమోదం విషయంలో గవర్నర్లకు లేదా రాష్ట్రపతికి నిర్దిష్ట సలహా ఇచ్చింది. ఈ సలహా తీర్పు ఆర్టికల్ 200 కింద గవర్నర్ అధికార పరిధికి, ఆయన విధులను సకాలంలో నిర్వహించాల్సిన రాజ్యాంగ బాధ్యతకు మరింత స్పష్టమైన సరిహద్దును నిర్దేశించింది.

బిల్లులపై ఈ మూడే మార్గాలు..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 200, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లుపై గవర్నర్‌కు మూడు నిర్దిష్టమైన మార్గాలను మాత్రమే నిర్దేశించింది. ఆ మూడు మార్గాలు.. ఒకటి. బిల్లును చట్టంగా మార్చడానికి తక్షణ ఆమోదం ఇవ్వడం. రెండు బిల్లును పునఃపరిశీలన కోసం సందేశంతో సహా శాసన సభకు తిరిగి పంపడం. అయితే, శాసనసభ దాన్ని మార్పులతో లేదా మార్పులు లేకుండా తిరిగి ఆమోదిస్తే, గవర్నర్ తప్పనిసరిగా ఆమోదం తెలపాలి (లేదా ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతికి రిజర్వ్ చేయాలి, ఇది అరుదైన సందర్భం). మూడు, రాష్ట్ర హైకోర్టు అధికారాలకు విఘాతం కలిగించే అంశాలున్నప్పుడు లేదా రాజ్యాంగపరంగా తీవ్రమైన అంశాలు ఉన్నప్పుడు మాత్రమే రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును రిజర్వ్ చేయడం. ఈ మూడింటిలో, బిల్లును కేవలం తన వద్ద నిలిపివేసి, శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచే 'పాకెట్ వీటో' అధికారం లేదా తిరస్కరించడంపై ఎలాంటి సమాచారాన్ని అసెంబ్లీకి పంపకుండా 'పూర్తి వీటో' అధికారం గవర్నర్‌కు నాలుగో లేదా రహస్య అధికారంగా లేదు.

గవర్నర్‌ది తటస్థ పాత్రే..

అయితే, గవర్నర్ బిల్లుపై ఎటువంటి నిర్ణయం తీసు కోకుండా, నిరవధికంగా తన వద్దే ఉంచుకోవడాన్ని 'రాజ్యాంగ మౌనం'గా కొందరు వర్ణించడానికి ప్రయత్నించారు. కానీ, సుప్రీంకోర్టు ఈ వాదనను ఖండించింది. రాజ్యాంగంలో కాలపరిమితి నిర్దేశించబడనంత మాత్రాన, ఆ అధికారాన్ని నిరవధికంగా వినియోగించుకునే స్వేచ్ఛ గవర్నర్‌కు ఉందని అర్థం కాదు. మంత్రి మండలి సలహా మేరకు పనిచేయాల్సిన రాజ్యాంగ అధిపతి, బిల్లుపై నిర్ణయం తీసుకోకుండా మౌనం వహిస్తే అది రాజ్యాంగ మౌనం కాదు, రాజ్యాంగ వైఫల్యం. గవర్నర్ శాసన ప్రక్రియలో ఒక 'తటస్థ' భాగంగా మాత్రమే ఉండాలి. చట్టసభ చేసిన చట్టాన్ని అడ్డుకోవడానికి, తన రాజకీయ ఇష్టాయిష్టాలకు అనుగుణంగా వ్యవహరించడానికి ప్రయత్నించడం రాజ్యాంగ నైతికతకు పూర్తి విరుద్ధం. అలాగే బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్రపతికి గానీ, గవర్నర్‌కు గానీ కాల పరిమితులను విధించే అధికారం న్యాయస్థానికి లేదు. ఇక కాలపరిమితి ముగిసిన తర్వాత 'ఆమోదం లభించినట్లుగా భావించడం అనే భావన, రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం, ఇది కార్యనిర్వాహక విధులను న్యాయ వ్యవస్థ దాదాపుగా స్వాధీనం చేసుకో వడమే అవుతుంది.


ఇది సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమే!

సుప్రీం ఇచ్చిన ఈ తీర్పు అధికారాల విభజన సిద్ధాంతాన్ని బలంగా నిలబెట్టింది. అయినప్పటికీ, అంతకుముందు ఇచ్చిన తీర్పుల్లోని ప్రధాన సూత్రాన్ని ఇది ఏ మాత్రం బలహీనపరచలేదు. అదేంటంటే, గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోకుండా బిల్లును నిరవధికంగా తన వద్దే ఉంచుకోవడం రాజ్యాంగ విరుద్ధం, చట్టవిరుద్ధం. గవర్నర్ ఉద్దేశపూర్వకంగా, వివరణ లేని దీర్ఘకాలిక జాప్యం చేసి, శాసన ప్రక్రియను అడ్డుకుంటే, న్యాయస్థానం తన పరిమిత న్యాయ సమీక్షా అధికారాన్ని ఉపయోగించి, బిల్లు మెరిట్‌లపై వ్యాఖ్యానించకుండా, నిర్ణీత కాల పరిమితిలో నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను ఆదేశించవచ్చు. గవర్నర్ తప్పనిసరిగా 'వీలైనంత త్వరగా' బిల్లుపై నిర్ణయం తీసుకోవాలనే ఆర్టికల్ 200లోని పదబంధాన్ని న్యాయ స్థానం మరింత గట్టిగా నొక్కి చెప్పింది. గవర్నర్ బిల్లును తిప్పి పంపకుండా, రాష్ట్రపతికి రిజర్వ్ చేయకుండా, ఆమోదం తెలపకుండా నిలిపి ఉంచితే, అది ప్రజల సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమే అవుతుంది. ఈ వివరణ, గవర్నర్‌కు నాల్గవ అధికారం లేదనే విషయాన్ని నిశ్చయాత్మకంగా బలపరుస్తుంది.

గవర్నర్లు ఈ అదేశాలను గౌరవించాలి!

రాష్ట్ర బిల్లులపై గవర్నర్ తీసుకునే నిర్ణయాలు కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వ ఏజెంట్‌గా పరిగణించడం, ఆయన ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును అడ్డుకోవడం అనేది సమాఖ్య వ్యవస్థ ప్రాథమిక సూత్రానికి విఘాతం కలిగిస్తుంది. న్యాయస్థానం గడువులను నిర్దేశించకపోయినా, రాజ్యాంగం విధించిన 'వీలైనంత త్వరగా' అనే ఆదేశాన్ని గౌరవించాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉంది. ఈ బాధ్యత, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాల నిర్ణయాలకు రాజ్యాంగ బద్ధమైన విలువను, వేగవంతమైన ఆచరణను అందించడం ద్వారా సమాఖ్య స్ఫూర్తికి జీవం పోస్తుంది.

## సమాచార హక్కు సామాన్యులకు ఎండమావేనా!




హైదరాబాద్,ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వాలు నాలుగు గోడల మధ్యలో పాలన చేస్తున్నట్టు కాకుండా పారదర్శకంగా చేస్తున్నట్టు ఉండాలి. పౌరులకు తెలియని స్థలమనేది ఉండకూడదు. రహస్య ప్రాంతాల్లో అవినీతి పెరిగిపోతుంది. అదే బహిరంగ ప్రదేశాల్లోనైతే నిర్మూలించబడుతుంది' అని అమెరికా మాజీ అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ అన్నారు. మన దేశంలో సమాచార హక్కు చట్టం (రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ 2005) అమలులోకి వచ్చి 2025 అక్టోబర్ 12వ తేదీ నాటికి ఇరవై ఏండ్లు పూర్తి అయింది. దేశ ప్రజాస్వామ్య పునాదిని పటిష్టంగా ఉంచే కీలకమైన చట్టాల్లో ఇది ఒకటి. ఓటు హక్కు తర్వాత అంతటి ప్రాధాన్యత కూడా దీనికే ఉంది. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండు దశాబ్దాలైన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఇన్నేండ్లైనా కానీ.. ఆర్‌టిఐ అమలు తీరు 'మేడి పండు చందం'గానే ఉంది. సమాచార పారదర్శకతపై ప్రభుత్వాలు, అధికారులు చెప్పే మాటలకు.. చేతల్లో పొంతనే లేదు. సమాచార హక్కు చట్టంద్వారా ఆఫీసుల్లో పాలన రికార్డుల వివరాలను పొందడానికి ఎన్నో సవాళ్లను, అడ్డంకులను, వైఫల్యాలను ఎదుర్కొంటున్నారు. దీనికి పాలకులు, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్లు, వ్యవస్థాగత లోపాలు వంటివే కారణాలుగా ఉన్నాయని చెప్పొచ్చు. రాజ్యాంగం తర్వాత అంతటి ప్రాముఖ్యత ఆర్‌టిఐకే దక్కింది. పార్లమెంట్ చేసిన చట్టాల్లో ఇదొక మైలురాయిగా నిలిచిపోయింది. అవినీతి నిర్మూలన, విధుల్లో బాధ్యతారాహిత్యాన్ని తగ్గించడంతోపాటు పారదర్శకతను పెంపొందించడం, సుపరిపాలనను అందించడం ఈ చట్టం ముఖ్య లక్ష్యాలుగా ఉన్నా యి. పంచాయతీ నుంచి ప్రధాని ఆఫీసు దాకా.. వివిధ స్థాయిల్లో జరిగే అవినీతిని బయటపెట్టడం, జవాబుదారీతనాన్ని పెంచడం, అభివృద్ధి, సంక్షేమాలపై తెలుసుకోవడం, ప్రభుత్వ రికార్డుల తనిఖీ ఆర్‌టిఐ సామాన్యులకు కల్పించిన ఒక ప్రధాన అస్త్రం కూడా. ఇది అమలులోకి వచ్చి ఇరవైఏండ్లే అయినా.. దీనికి తొలి అడుగుపడినది దశాబ్దాల కిందటే అని చెప్పొచ్చు. 1976లోఉత్తరప్రదేశ్ స్టేట్ వర్సెస్ రాజ్ నారాయణ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పునిస్తూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పని తీరుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తప్పకుండా ఇవ్వాల్సిందే! సమాచార హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగమని, స్వేచ్ఛ హక్కు 19(1)(ఏ)లో ఇమిడి ఉందని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పు తర్వాతనే సమాచార హక్కు చట్టం రూపొందించుకోవాలనే ఆలోచన పాలకుల్లో వచ్చింది. అనంతరం 2005నుంచి అమలులోకి వచ్చింది.రెండు దశాబ్దాల కాలంలో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారులు సాధించిన విజయాలెన్నో ఉన్నాయి. ఇందుకు ఉదాహరణ.. 2జీ స్పెక్ట్రం కేటాయింపులు, కామన్వెల్త్ గేమ్స్, కోల్ గేట్ స్కామ్ అవినీతి గుట్టు బయట పెట్టడంలో ఆర్‌టిఐ కీలకంగా నిలిచింది. జాతీయ ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్, రికార్డుల తనిఖీలో ఎంతో సమర్థవంతంగా వినియోగించుకునేలా దోహదపడింది. ఇక దరఖాస్తుదారులకు అడ్డంకులు కూడా చాలా ఎక్కువే. సమాచారం ఇచ్చేందుకు అధికారులు కావాలనే ఆలస్యం చేయడం, లేదా అసంపూర్తిగా ఇవ్వడం, లేదంటే దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితులను నూటికి తొంభై శాతం మంది ఎదుర్కొంటుంటారు. అవినీతి బహిరంగ పరిచే ఆర్‌టిఐ కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడడం, దాడులు వంటివి చేస్తున్నారు. ఇప్పటివరకు వందల మంది కార్యకర్తలు హత్యకు గురయ్యారు. వేలమంది దాడులు ఎదుర్కొన్నారు. దేశంలో సామాన్యులు సమాచార హక్కును పొందడంలో ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులను ఎదుర్కొంటున్నట్టు సర్వేలు తేల్చిచెబుతున్నాయి. 30 రోజుల గడువులోపు ఇవ్వాల్సిన సమాచారానికి నెలల, ఏండ్లకు ఏండ్లు ఎదురు చూడాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం, పారదర్శకత పాటించకపోవడం కారణాలని సమాచార నిపుణులు సైతం పేర్కొంటున్నారు.

దేశంలోని పౌరులకు ఆర్‌టిఐ ఒక శక్తిమంతమైన సాధనం అయినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో సరిగా అవగాహన కల్పించడం లేదు. ప్రచారమూ చేయడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలామందికి ఆర్‌టిఐ ఉందనేదికూడా తెలియదు. తద్వారా ఆఫీసుల్లో సమాచారాన్ని పొందే హక్కు సామాన్యులకు దక్కడం లేదు. పాఠశాలస్థాయి నుంచే సమాచార హక్కు ప్రాధానత్యపై అవగాహన పెంపొందించాలి. కేంద్ర, రాష్ట్రాల కమిషన్ల వెబ్‌సైట్లు కూడా యూజర్ -ఫ్రెండ్లీగా లేవు. అప్లికేషన్ల ఫాలో అప్, ఒటిపిల్లో లేట్, పేమెంట్ ఫెయిల్యూర్లు వంటి టెక్నికల్ ఇష్యూలు దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారాయి. దరఖాస్తుదారులు కావలసిన సమాచారం పొందేందుకు నగదును చెల్లిస్తున్నా.. సమాచారం ఇవ్వకుండా.. చట్టాన్ని సరిగా అమలు చేయకుండా నీరుగార్చుతున్నారు. ఇలాంటివి కూడా చట్టాన్ని బలహీనం చేస్తూ.. పారదర్శకతకు విఘాతంగా మారాయి. ఆర్‌టిఐ కమిషన్లను బలోపేతం చేసి.. డిజిటల్ టెక్నాలజీని మెరుగుపరచాలని దరఖాస్తుదారులు, సమాచార నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్‌టిఐ విజయవంతం అమలవ్వాలంటే కమిషన్లను క్రమానుగతంగా బలోపేతం చేస్తుండాలి.

మౌలిక వసతులు కల్పిస్తుండాలి. దరఖాస్తులను, అప్పీళ్లను సకాలంలో పరిష్కరించాలి. ఇలా సమాచారంవేగంగా, స్పష్టంగా పొందినప్పుడే సామాన్యులు ప్రజాస్వామ్య వ్యవస్థలో చురుకుగా భాగస్వాములవుతారు. ఇలా చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంది. ఆఫీసుల్లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శిస్తుంటే.. ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తారు. మెరుగైన సేవలను అందడంతోపాటు అధికారుల్లో పారదర్శకత కూడా పెరుగుతుంది. అవినీతి తగ్గుతుంది. ఇలాంటి చర్యలు తీసుకున్నప్పుడే ప్రజాస్వామ్య విజయవంతానికి ఓటు హక్కు మాదిరిగానే సమాచార హక్కు తయారవుతుంది. దేశంలో కేంద్ర, రాష్ట్రాలకు వేర్వేరుగా సమాచార హక్కు కమిషన్లు ఉన్నప్పటికీ ఎవరూ.. చట్టాన్ని సరిగా అమలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్రాల్లోని కమిషన్లలో ఏటేటా లక్షల్లో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. అప్పీళ్లపైనా విచారణ వేగంగా, సరిగా జరగడంలేదు. ఆర్‌టిఐ కమిషన్ల నియామకాల్లోనూ రాజకీయ అధికార జోక్యం కూడా ఎక్కువే. సకాలంలో నియామకాలు చేయడం లేదు. కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాయి. నిబద్ధత కలిగిన వ్యక్తులను నియమించడం లేదు. ఇలాంటి ఆరోపణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. ఇవి సందర్భానుసారం సామాజిక మాధ్యమాల్లోనూ చూస్తుంటాం కూడా. 2019లో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 13, 16లను కేంద్ర ప్రభుత్వం సవరించి.. సమాచార కమిషనర్ల పదవీ కాలాన్ని నిర్ణయించే బాధ్యతను కట్టబెట్టుకుంది. కేంద్రం తీరుతో సమాచార కమిషనర్ల స్వతంత్రతకే ముప్పు తలెత్తిందని, సమాచార హక్కు చట్టం ఉనికి ప్రమాదమని సమాచార నిపుణుల నుంచి విమర్శలెన్నో వచ్చాయి. ఆర్‌టిఐ జబ్బుపడిన చట్టంగా మారిందని వ్యాఖ్యలు కూడా చేశారు.

## యాంటీ బయోటిక్స్ వాడవద్దు

ఆదిలాబాద్,అతిగా యాంటీ బయోటిక్స్ వాడితే ప్రమాదమని వైద్యులు హెచ్చరించారు. తమకు తెలిసిన మందులను వైద్యుల సలహా లేకుండా వాడరాదన్నారు. ఇది ఇతర వ్యాధులకు దారితీస్తుందని అన్నారు. 'ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారం' ను పురస్కరించుకొని శనివారం రిమ్స్ మైక్రో బయాలజీ విభాగం, వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ.. రిమ్స్ నుంచి కలెక్టరేట్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ మాట్లాడుతూ.. యాంటీబయోటిక్స్ వాడకం వల్ల ఏర్పడే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. అధికంగా యాంటీబయోటిక్స్ వినియోగంతో ప్రజల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. వైద్యుల సూచనల మేరకు వాటిని వినియోగించాలన్నారు. అయితే ఇది తెలియక ఎవరికి వారుత తమకు తోచిన మందులను వాడేస్తున్నారని అన్నారు. ఇది ప్రమాదమో తెలుసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ దీపక్ పుష్కర్, ఎన్‌సీడీ కార్యక్రమాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని రైతులకు పూర్తి న్యాయం

అమరావతి, రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యమని పురపాకల శాఖ మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని పేర్కొన్నారు. రాజధాని ప్రాంత రైతుల సమస్యలపై సమావేశంలో చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు. ఖచ్చితంగా ఆరు నెలల్లో రైతుల సమస్యలకు పరిష్కారం వస్తుందన్నారు. కోర్ట్ కేసులు.. ఇతర కారణాల వల్ల ఆలస్యం అయిందని చెప్పారు. ఒకరిద్దరు వాళ్ల స్వార్థం కోసం చెప్పే అంశాలను నమ్మవద్దని మంత్రి అన్నారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కీలక సమావేశం నిర్వహించింది. రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ భేటీ అయ్యింది. ఈ కమిటీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఉన్నారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారులతో కమిటీ సమావేశమైంది. దీనికి రైతు జేఏసీ ప్రతినిధులు హాజరయ్యారు. రైతులు లేవనెత్తిన అంశాలపై పరిష్కారం దిశగా కమిటీ సమాలోచనలు చేసింది. గతంలో జగన్ ప్రభుత్వ తీరు వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని తమ కమిటీకి సీఎం సూచించారని తెలిపారు. రాజధానిలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తాం. సీఆర్డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరీబు భూములను గుర్తిస్తారు. గ్రామ కంఠాల సమస్య కూడా పరిష్కరిస్తాం. లంక భూముల సమస్యను జగన్ జఠిలం చేశారు. దీనిపై వైకాపా నేతలు కోర్టులో కేసులు వేశారు. అసైన్డ్ భూములను కొందరు అమ్ముకుంటే జగన్ ప్రభుత్వం తప్పుబట్టి ఆపేసింది. మిగతా ప్రాంతాల్లో అసైన్డ్ చట్టానికి, రాజధానిలో అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం పడుతుంది. 90 శాతం రైతులకు ఎ÷-లాట్ల కేటాయింపు పూర్తయింది. రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం మౌలిక వసతులు కల్పిస్తాం. 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తాం, మరో వారం తర్వాత త్రిసభ్య కమిటీ సమావేశం అవుతుందని పెమ్మసాని అన్నారు. రాజధాని రైతుల సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన కమిటీ శనివారం భేటీ అయ్యిందన్నారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని కోసం 30 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారన్నారు. ఇంత మంది రైతులు ఉన్నప్పుడు అనుకున్నంత వేగంగా అన్నీ జరగవని చెప్పుకొచ్చారు. 700 ఎకరాల భూమిలో రైతులకు సమస్యలు ఉన్నాయని.. వీటిలో వివిధ కారణాలతో సమస్యలు వచ్చాయని తెలిపారు.

సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలని భేటీలో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా జరిబు ల్యాండ్ సమస్యల విషయంలో నిజమైన జరిబు రైతులకు న్యాయం చేస్తామని వెల్లడించారు. దీనిలో కూడా 180 ఎకరాల్లో మాత్రమే సమస్య వచ్చిందని.. 30 రోజుల్లో నిజనిర్ధారణ చేసి పరిష్కారం చేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. గ్రామకంఠాల విషయంలో గైడ్ లైన్స్ పాటించకుండా చేసినందు వల్ల 36 ఎకరాల్లో సమస్యలు వచ్చాయని కేంద్రమంత్రి వివరించారు. గ్రామ కంఠాలలో ఎవ్వరికైనా ఎక్కువ ఇచ్చినట్టు గుర్తిస్తే వాటిపై రీ సర్వే చేస్తామన్నారు. 30 రోజుల్లో అడిషనల్ కమిషనర్ రిపోర్ట్ తీసుకొని పరిష్కరిస్తామన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో, జగన్ వచ్చాక లంక భూముల విషయంలో కోర్టు చిక్కులు ఏర్పడ్డాయని అన్నారు. అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో అమ్ముకునే అవకాశం ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం కుదరదని చెప్పడంతో ఇబ్బందులు వచ్చాయన్నారు. 90 శాతం మందికిపైగా రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేసినట్లు తెలిపారు. గ్రామాల వారీగా అభివృద్ధికి 20 రోజుల్లో 25 గ్రామాలకు డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. 2026 జూన్ నాటికి గ్రామాల్లో మౌలికవసతులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. లే ఔట్‌లు ఇచ్చిన చోట సరిహద్దు రాళ్ళు పోయాయన్నారు. దీంతో డిసెంబర్ 5 నుంచి సరిహద్దు రాళ్ళ సమస్య పరిష్కరిస్తామన్నారు. అపోహలు నమ్మొద్దని రైతులకు చెబుతున్నామని.. రెండు వారాలకు ఒకసారి ఈ కమిటీ సమావేశమవుతుందని తెలిపారు. సమస్యలన్నింటినీ ఆరు నెలలలోగా పరిష్కరిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో ఉన్న లే ఔట్లలో సరిహద్దు రాళ్లు వేయాలని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రెండు వైపుల మాత్రమే సర్వే రాళ్లు వేయగలిగామన్నారు. డ్రైనేజ్ వ్యవస్థ సెట్ అయ్యాక మిగిలిన రెండు వైపులా సర్వే రాళ్లు వేస్తామని చెప్పారు. రాజధాని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న పైప్ లైన్లు పనికి రావని.. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ రావాలని తెలిపారు. రాజధాని గ్రామాల్లో శ్మశానాలు లేవన్నారు.

## మరోమారు షాక్ ఇచ్చిన బంగారం ధరలు

హైదరాబాద్,బంగారం కొనాలనుకునే వారికి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి భారీగా పెరుగుతున్నాయి. బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

# ఎపి టెన్త్ పరీక్షల తేదీలు విడుదల

అమరావతి,ఆంధ్రప్రదేశ్ పదోతరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. ఈమేరకు రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డు వివరాలను వెల్లడించింది. 2026 మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఏపీ టెన్త్ ఎగ్జామ్స్ జరుగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ప్రకటించింది. 16న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న మ్యాథ్స్, 25న భౌతికశాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘిక శాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్2), ఏప్రిల్ 1న సెకెండ్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్షలు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు అధికారులు.

# ఉపరితల ఆవర్తన ప్రభావం

అమరావతి, వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారంకి దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమ – వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత 48 గంటల్లో పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని వివరించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పేర్కొన్నారు. వర్షాల దృష్ట్యా ప్రజలు, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# చీలిక స్పష్టం!

హైదరాబాద్,తెలంగాణలో బీజేపీ ప్రస్థానం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది. ఇందుకు ప్రధాన కారణం నేతల మధ్య సయోధ్య లేకపోవడమే.. సయోధ్య లేకపోవడం ఒక్కటే కాదు.. రాష్ట్ర పార్టీ నేతలలో విభేదాలు తరచూ బహిర్గతమౌతున్నాయి. అంతే కాదు.. ఈ నేరుగా పేరు పెట్టి మరీ ఒకరినొకరు బహిరంగంగా విమర్శలకు దిగేంతగా ఈ విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. ఇంత కాలం తెలంగాణ బీజేపీలో అంతర్గత కుమ్ము లాటలు,నాయకుల మధ్య విభేదాలు, వివాదాలు సాగుతూనే ఉన్నాయి. అయితే జూబ్లీ ఉప ఎన్నిక ఫలితం తరువాత అవి రచ్చెక్కాయి. రాష్ట్రంలో అధికారమే తరువాయి అన్న పరిస్థితి నుంచి జూబ్లీ ఉప ఎన్నికలో డిపాజిట్ కూడా గల్లంతయ్యే పరిస్థితికి బీజేపీ దిగజారిపోవడానికి ప్రధాన కారణం ఆ పార్టీ రాష్ట్రనాయకుల మధ్య సయోధ్య లేమే అన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. అసలు ఈ పరిస్థితికి కారణమేంటి? నాయకుల మధ్య విభేదాల వెనుక ఉన్న అసలు సిసలు రీజనేంటి? అని పరిశీలిస్తే.. సాధారణంగా బీజేపీలోకి బయట నుంచి వచ్చి చేరిన వారు ఇమడ లేరు. హిందుత్వ భావజాలం, ఆర్ఎస్ఎస్ బీజేపీకి మెంటార్ గా వ్యవహరించడం.. అన్నిటికీ మించి బీజేపీలోకి బయటి పార్టీలకు వచ్చిన వారిని తొలి నుంచీ పార్టీలో ఉన్నవారు మనస్ఫూర్తిగా కలుపుకునే పరిస్థితి లేకపోవడం సహజపరిణామం. అయితే బీజేపీ నాయకత్వం మోడీ, షా చేతులలోకి వచ్చిన తరువాత పార్టీలో ఆ పరిస్థితి మారిపోయింది. సిద్ధాంతం కంటే ఓట్లు, సీట్ల లెక్కలకే బీజేపీ హైకమాండ్ ప్రాధాన్యం ఇవ్వడంతో దేశ వ్యాప్తంగా బీజేపీకీ ఇతర పార్టీలకీ, మరీ ముఖ్యంగా కాంగ్రెస్ కూ తేడా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పార్టీలో తొలి నుంచి ఉన్నవారూ, తరువాత వచ్చి చేరిన వారి మధ్య అగాధం ఏర్పడింది. అది పెరుగుతూ వస్తోంది. మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలో ఈ పరిస్థితి మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జూబ్లీ ఉప ఎన్నికలో ఘోర పరాజయం తరువాత ఈ విభేదాలు నివురు తొలగించుకుని నిప్పులా బహిర్గతమయ్యాయి. ముఖ్యంగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ల మధ్య సైద్ధాంతిక అంతరం ఈ విభేదాలు రాజీకి ఆస్కారం లేనంత తీవ్ర స్థాయికి చేరడానికి కారణమయ్యాయి. బండి సంజయ్ నూటికి పదహారణాల హిందుత్వ వాది. ఈటల రాజేందర్ రాజకీయ నేపథ్యం ఇందుకు పూర్తి భిన్నం. ప్రాణం ఉన్నంతవరకు హిందూత్వమే తన మార్గమని బండి సంజయ్ అంటే.. మతతత్వం ఇక్కడ నడవదని ఈటల కుండబద్దలు కొడతారు. బరాబర్ హిందుత్వ అజెండాతో ఎన్నికలో పోటీ చేయడం కరెక్టు కాదంటారు. అలా పోటీ చేస్తే ఇదిగో ఇలా డిపాజిట్లు గల్లంతౌతాయని ఈటల ఎలాంటి శషభిషలూ లేకుండా కుండబద్దలు కొట్టేశారు. జూబ్లీలో బీజేపీకి డిపాజిట్ గల్లంతు కావడానికి హిందుత్వ అజెండాయే కారణమని విస్పష్టంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఈటల నేరుగా బండి సంజయ్ పేరు ప్రస్తావిస్తూ ఆయన మతతత్వ అతివాద ధోరణితో చేసిన ప్రచారమే జూబ్లీలో బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతు కావడానికి కారణమని చెప్పడమే కాకుండా, ప్రచార అజెండాలో మతం ప్రస్తావన లేకుండా ఉంటే ఫలితం మెరుగ్గా ఉండేదని చెప్పారు. ఈ నేపథ్యంలో బండి వర్సెస్ ఈటల వ్యవహారం రాష్ట్ర పార్టీలో స్పష్టమైన చీలకను స్ఫురింప చేస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు.

# కృష్ణా జలాల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం వైఫల్యం

అమరావతి, కృష్ణా జలాల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ సిఎం జగన్ అన్నారు. ట్రిబ్యునల్‌లో రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా వాదనలు వినిపించాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను సమర్థవంతంగా వినిపించాలని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మాజీ సీఎం వైఎస్ జగన్ 9 పేజీలతో కూడిన లేఖ రాశారు. పొరపాటు జరిగితే ఏపీ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నదిలో 763 టీఎంసీలను కేటాయించేందుకు ట్రిబ్యునల్ అంగీకరిస్తే ఏపీకు తీవ్ర అన్యాయం జరుగుతుందని.. ఈ నేపథ్యంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం తమ వాదనలు వినిపించాలని లేఖలో జగన్ కోరారు. 'రాయలసీమ ప్రాజెక్టులపై టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.. 1996లో చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అల్మట్టి ప్రాజెక్టు ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచే పనులు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్షాలు, రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆల్మట్టి ఎత్తు పెంపు వలన ఏపీ హక్కులకు ముప్పు ఏర్పడుతుంది. దీనిపై అప్పట్లో ఎన్ని ఆందోళనలు చేసినా చంద్రబాబు పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయాన్ని రైతుల ఆందోళనలను ఖాతరు చేయలేదు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆల్మట్టి ఎత్తు పెంపునకు అనుమతి ఇచ్చింది. అంతేకాదు 2014లో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ఏపీ హక్కులను తెలంగాణకు పూర్తిగా వదిలేసింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సీఎంగా ఉన్న తరుణంలోనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్లిష్ట పరిస్థితిలో టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర హక్కులను సమర్థంగా కాపాడాలి.

# మిస్టర్ జస్టిస్..మిగిలిన పెండింగ్‌ల మాటేమిటీ?



హైదరాబాద్,తెలంగాణలో పార్టీ ఫిరాయించిన పదిమంది శాసనసభ్యుల అనర్హత విషయమై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ రానున్న నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి అని తీవ్రంగా వ్యాఖ్యానించడంతో ఎక్కడెక్కడ, ఏ ఏ వ్యవస్థల్లో, ఎన్నెన్ని కేసులు, పిటిషన్లు ఏళ్ళుపూళ్ళు గడిచిపోయినా, కాల పరిమితి ముగిసినా తుది నిర్ణయం రాకుండా పడి ఉన్నాయో, ఎంతమంది ఎన్నెన్ని ఇబ్బందులు పడుతున్నారో అన్న చర్చ జరగాల్సిన అవసరం ఏర్పడింది. ఇవ్వాళే జస్టిస్ బిఆర్ గవాయ్ సుప్రీమ్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేస్తుండటం కాకతాళీయం. తెలంగాణ స్పీకర్ చేసింది తీవ్రమైన కోర్టు ధిక్కారమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకుంటారో నిర్ణయించుకోండి అనడం అంటే నాలుగు వారాల్లోగా పార్టీ ఫిరాయింపుల మీద నిర్ణయం తీసుకోకపోతే జైలుకు పంపుతామని చెప్పడమే కదా. పార్టీ ఫిరాయింపుల మీద తాము విధించిన మూడు మాసాల గడువు దాటిపోయినా ఒక నిర్ణయం తీసుకోనందుకు తెలంగాణ స్పీకర్ మీద ఆగ్రహించిన ఇదే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ తో కూడిన అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం పార్లమెంట్ లేదా వివిధ రాష్ట్రాల శాసన సభలూ ఆమోదించిన బిల్లులను త్వరగా పరిష్కరించాలని కోర్టులు జోక్యం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధం అన్నది. బిల్లులను సుదీర్ఘ కాలం పెండింగ్‌లో పెట్టుకునే అధికారం గవర్నర్‌లకు లేదంటూనే కోర్టులు గడువు విధించలేవని చెప్పింది. తమ పరిధిలో నిర్ణయాలు తీసుకునే విషయంలో రాజ్యాంగ వ్యవస్థలకు కాల పరిమితి అంటూ ఏమీ నిర్దిష్టంగా లేదు. గురువారం నాడు సుప్రీం కోర్టు కొద్ది కాలం క్రితం రాష్ట్రపతి లేవనెత్తిన సందేహాలకు ఇచ్చిన రాజ్యాంగ పరమయిన వివరణ లేదా విశ్లేషణతో ఆ విషయం అర్థం అవుతున్నది. న్యాయస్థానాలు, రాష్ట్రపతి, గవర్నర్‌లు, పార్లమెంట్, అసెంబ్లీ స్పీకర్ వ్యవస్థలు తమకు సంక్రమించిన రాజ్యాంగ పరిధిలో తీసుకునే నిర్ణయాలకు రాజ్యాంగం లేదా చట్టాలూ స్పష్టమైన కాల పరిమితి ఏదీ విధించలేదు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న కనీసం నాలుగు రాష్ట్రాలలో 33 బిల్లులు గవర్నర్‌ల ఆమోదం కోసం వేచిచూస్తున్నాయి. ఇందులో అత్యధికంగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో. ఈ జాప్యం రాష్ట్ర ప్రభుత్వాలూ గవర్నర్‌ల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నది. ఎటువంటి వివరణ లేకుండా సుదీర్ఘ కాలం బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాలు గవర్నర్‌ల మీద సుప్రీం కోర్టు గడప తొక్కిన విషయం జగద్విదితం. పశ్చిమ బెంగాల్ ఉదాహరణే మళ్ళీ తీసుకుంటే ఆ రాష్ట్రం లో 2022 నుండి ఏడు బిల్లులు, 2023 నుండి ఒక బిల్లు గవర్నర్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ బిల్లులన్నీ యూనివర్సిటీ చట్టాలకూ, పట్టణ గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించినవి. అసంఖ్యాకంగా వచ్చే కోర్టు కేసులు కూడా పరిష్కరించడానికి రాజ్యాంగం స్పష్టంగా కాలపరిమితి ఏదీ విధించలేదు. న్యాయ వ్యవస్థ తానే రూపొందించుకున్న విధానాలు, నిబంధనల ఆధారంగా వ్యవహరిస్తుంది. అయితే విచారణ వేగవంతంగా జరగాలన్న అంశం రాజ్యాంగం లోని ఆర్టికల్ 21తో ముడిపడి ఉండటమేకాక కేసుల వాయిదాల సంఖ్యా తగ్గించే క్రమంలో నిబంధనల్లో మార్పులు చేయడం ద్వారా కేసులను త్వరగా పరిష్కరించేందుకు సుప్రీం కోర్టు ఆదేశాలు కొంత అక్కర కొస్తున్నాయి. వాస్తవ పరిస్థితుల మీద ఒకసారి దృష్టి సారిస్తే దిగువ కోర్టుల్లో నాలుగు కోట్ల అరవై లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారిక లెక్కలు చెపుతున్నాయి. వివిధ హైకోర్టులలో 63 లక్షలు, సుప్రీం కోర్టు లో 87 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఈ ఏడాది జులై 31 నాటి గణాంకాలు. దిగువ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అధిక భాగం భూతగాదాలకు సంబంధించినవే కావడం విశేషం. శాసన, న్యాయ వ్యవస్థలు రెండు రాజ్యాంగబద్ధమైన సంస్థలే. రెండు వ్యవస్థల అధికారాలు దేనివి దానికే ఉంటాయి. పార్టీ ఫిరాయింపుల మీద ఏ కారణం చేతనైనా ఒకవేళ తెలంగాణ శాసనసభ అధ్యక్షుడు నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోలేకపోతే నిజంగానే ఆయనను జైలుకు కూడా పంపే అంతటి కఠిన నిర్ణయం సుప్రీం కోర్టు తీసుకునే అవకాశం ఉందా! అది న్యాయ వ్యవస్థ పరిధిని దాటి ఉంది అనిపించడం లేదా అన్న చర్చ జరుగుతున్నది. మరి వివిధ కోర్టులలో పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న కోట్లాది కేసుల గురించి ఏం చెబుతారు. తెలంగాణ స్పీకర్ మీద సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్య తీర్పులో భాగంగా వెలువరించింది కాదు. వాదనలు సాగుతున్న సమయంలో చేసిన వ్యాఖ్య మాత్రమే. సరే ఈలోగా గత రెండు మూడు రోజులుగా తెలంగాణ స్పీకర్ పదిమంది శాసనసభ్యుల ఫిరాయింపు వ్యవహారంలో విచారణ కూడా వేగవంతం చేశారు. నాలుగు వారాల్లోగా ఒక నిర్ణయం జరుగుతుందని స్పీకర్ తరఫున సుప్రీం కోర్టులో వాదనలు వినిపించిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వి, ముకుల్ రోహాత్గి కూడా సుప్రీం కోర్టు ధర్మాసనానికి హామీ ఇచ్చారు. స్పీకర్ నిర్ణయం అంతిమంగా ఎలా ఉంటుందో కొద్ది రోజుల్లో తెలిసిపోతుంది. తెలంగాణ అసెంబ్లీ లో ప్రస్తుతం ఓ పదిమంది శాసన సభ్యులు భారత రాష్ట్ర సమితి నుండి అధికార కాంగ్రెస్ లోకి ఫిరాయించారు. అనర్హత వేటు పడుతుందేమో అన్న అనుమానం రావడంతో కండువా కప్పుకుంటే, నియోజక వర్గం అభివృద్ధి పనులకోసం ముఖ్యమంత్రిని కలిస్తే, సరదాగా కబుర్లు చెప్పుకుని చాయ్ తాగడానికి పిసిసి సభ్యుడిని కలిస్తే పార్టీ మారినట్లా అని బుకాయిస్తున్నారు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్నట్టు 2014 లో రాష్ట్రం ఏర్పడి తాము అధికారం లోకి వచ్చిన దగ్గరినుండి అధికారం కోల్పోయే దాకా బిఆర్ఎస్ ఉజ్జాయింపుగా ఓ 38 మంది శాసన సభ్యులను ఇతర పార్టీల నుండి చేర్చుకున్న విషయం ఎవరయినా మరిచిపోతారా. అట్లా అని ప్రస్తుతం ఫిరాయించిన వారిని సమర్థించాల్సిన అవసరం లేదు. అయినా రాజకీయాల్లో నైతికత కోసం వెతకడం ఏమిటి నేతి బీరకాయల్లో నెయ్యి కోసం వెతికినట్టు. అయితే ప్రస్తుతం పార్టీ ఫిరాయించిన వారిలో ఇద్దరి మీద మాత్రం వేటు తప్పనిసరి. అందులో ఒకరు ఖైరతాబాద్ శాసన సభ్యుడు దానం నాగేందర్, ఆయన 2023 లో బిఆర్ఎస్ తరఫున శాసన సభ్యుడిగా ఎన్నికై 2024 లోక సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓడిపోయారు, పార్టీ మారిన ఆధారం స్పష్టంగానే ఉంది. ఈయన కాంగ్రెస్ నుండి తెలుగుదేశం పార్టీకి, అక్కడి నుండి మళ్ళీ కాంగ్రెస్‌కు తిరిగి బిఆర్ఎస్‌కు, ఇప్పుడు తిరిగి సొంత గూడు అంటూ కాంగ్రెస్‌కు చేరుకున్నారు ప్రజా సేవ కోసం. ఇక రెండో నాయకుడు కడియం శ్రీహరి, వీరు 2023 ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ నుండి గెలిచి ప్రజా సేవ కోసమే అధికార పక్షం లో చేరారు. అయితే కూతురికి కాంగ్రెస్ లోకసభ స్థానం నుండి టికెట్ ఇప్పించుకుని ఆమె గెలుపు కోసం కృషి చేయడం వల్ల అనర్హత తప్పేట్టు లేదు. శ్రీహరి రాజకీయాలతోబాటు పార్టీ ఫిరాయించడంలో కూడా సీనియర్‌యే. తెలుగుదేశం నుండి భారత రాష్ట్ర సమితికి అక్కడి నుండి కాంగ్రెస్‌కు మారారు. వీరిరువురూ వేటు పడక ముందే రాజీనామా చేస్తారని వార్తలొస్తున్నాయి. స్పీకర్ మీద సుప్రీం కోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యం లో ఒకవేళ వేటు పడితే ఆరు నెలల వరకూ పోటీచేసే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉన్నందున తామే రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధం కావాలని అనుకుంటున్నారని సమాచారం. మొన్ననే జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక గెలిచిన ఊపులో ఉంది అధికార పక్షం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా ఆ స్థానాన్ని పార్టీకి దక్కేట్టు చేసారు. ఆ పొరుగునే ఉన్న ఖైరతాబాద్ కూడా అదే ఊపులో గెలవచ్చన్న ధీమా ఉండొచ్చు. స్టేషన్ ఘనపూర్ గెలిస్తే కాంగ్రెస్ బలంలో ఒకటి పెరిగినట్టు, పోయినా అది ప్రతిపక్షానిదే కాబట్టి బెంగ లేదు. మిగిలిన ఎనిమిది మంది శాసన సభ్యుల విషయంలో ప్రతిపక్ష బిఆర్ఎస్ పశ్చిమ బెంగాల్‌లో జరిగింది చూసి కొంత ఉత్సాహం తెచ్చుకున్నది. ఇటీవల పశ్చిమబెంగాల్‌లో బిజెపి నుంచి తృణమూల్ కాంగ్రెస్‌కు ఫిరాయించిన శాసనసభ్యుడు ముకుల్‌రాయ్ బిజెపి వీడిపోయినట్టు ఆధారాలు లేవని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రకటించడంతో బిజెపి వేసిన పిటిషన్ మీద హైకోర్టు ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక్కడ కూడా ఒకవేళ అక్కడి స్పీకర్ లాగానే వీళ్ళంతా బిఆర్ఎస్ వీడిన ఆధారాలు లేవని తేల్చినట్టయితే కోర్టులు తమకు న్యాయం చేస్తాయన్నది ఆ పార్టీ ఆశ కావచ్చు. అదలా ఉంచితే ఒక విషయం ఇక్కడ తప్పనిసరిగా చర్చించాలి. 1985లో రాజ్యాంగ సవరణద్వారా ఏర్పాటైన పార్టీ ఫిరాయింపుల చట్టం పార్టీ ఫిరాయింపుల మీద శాసనసభ స్పీకర్ ఎప్పటిలోగా నిర్ణయం తీసుకోవాలి అన్న విషయంలో స్పష్టతనివ్వలేదు. నిజానికి ఈ చట్టం ఎంతో లోపభూయిష్టంగా ఉన్నదనడానికి చట్టం అమల్లోకి వచ్చిననాటి నుండి నేటివరకు జరిగిన అనేక ఉదంతాలు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2004 2009 మధ్య అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన పదిమంది శాసన సభ్యులు పార్టీ నిర్ణయాన్ని కాదని శాసనమండలి ఎన్నికల్లో ఒక స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేసిన కారణంగా వారందరి మీద అనర్హత వేటు వేయాలని టిఆర్ఎస్ కోరినప్పటికీ ఆనాటి స్పీకర్ ఆ శాసనసభ పదవీకాలం ముగిసే వరకు ఈ వ్యవహారాన్ని తేల్చకుండా చివరకు 2009లో సమావేశాలు ముగింపుకొచ్చిన సమయంలో వారిని అనర్హులుగా ప్రకటించారు. ఇటువంటి ఉదాహరణలు మనకు దేశంలోని పలు శాసనసభల్లో, రాజ్యసభలో కూడా అనేకం కనిపిస్తాయి. 2019 లో ఎన్నికలలో ఓడిపోగానే తెలుగు దేశం రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరిన వైనం ఉదాహరణే కదా, అంతకు ముందు అధికారం లో ఉండగా ప్రతిపక్ష పార్టీ వైఎస్ఆర్‌సిపి నుండి 23 మంది శాసన సభ్యులను, ముగ్గురు లోక్‌సభ సభ్యులను తెలుగుదేశంలో చేర్చుకుని ఓ నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టారు కదా చంద్రబాబు నాయుడు. 2014లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికైన శాసనసభ్యుడు పార్టీకి రాజీనామా చేయకుండానే అప్పటి టిఆర్ఎస్ మంత్రివర్గంలో సభ్యుడిగా చేరారు. పార్టీ ఫిరాయింపుల చరిత్ర ఈ రోజుదా, 1967 లో హర్యానాలో గయా లాల్ అనే శాసన సభ్యుడు పక్షం రోజుల్లో మూడు సార్లు పార్టీ మారాడు, కాంగ్రెస్ నుండి యునైటెడ్ ఫ్రంట్‌కు మళ్ళీ తిరిగి కాంగ్రెస్‌కు అది జరిగిన తొమ్మిది గంటల్లోనే మళ్ళీ యునైటెడ్ ఫ్రంట్‌కు మారి ఆయారాం గయారాం అనే నానుడిని వాడుకలోకి తెచ్చారు. గెలిచి వచ్చిన పార్టీకి రాజీనామా చేయకుండా అధికార

# కేంద్రంపై విరుచుకుపడిన భగవంత్ మాన్



చండీగఢ్ : కేంద్రం ప్రవేశపెట్టనున్న ఆర్టికల్ 240పై వివాదంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ ఆదివారం ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఈచర్య "రాజధానిని కొల్లగొట్టేందుకు కేంద్రం పన్నిన కుట్ర"గా అభివర్ణించారు. చండీగఢ్ తమ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఉంటుందని అన్నారు. చండీగఢ్ నిర్మాణం కోసం తమ రాష్ట్రంలో కొన్ని గ్రామాలు ధ్వంసమయ్యాయని, దానిపై పంజాబ్‌కు మాత్రమే హక్కు ఉందని అన్నారు. చండీగఢ్‌ను తాము వదులుకోమని, అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కేంద్రం తీసుకున్న ఈచర్య పంజాబ్ గుర్తింపుపై దాడి అని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నేత కేజ్రీవాల్ పేర్కొన్నారు. "చరిత్ర సాక్షి.. పంజాబీలు ఎప్పుడూ నియంతృత్వానికి తలవంచలేదు. ఇప్పుడు కూడా తలంవంచే ప్రసక్తే లేదు. చండీగఢ్ పంజాబ్‌కు చెందినది. అది అలాగే ఉంటుంది" అని అన్నారు. దేశ భద్రత, ధాన్యం, నీటి కోసం ఎల్లప్పుడు త్యాగాలు చేసిన పంజాబ్ .. దాని హక్కుని కోల్పోనీయమని అన్నారు. "పంజాబ్ వ్యతిరేక చర్య, సమాఖ్య నిర్మాణంపై స్పష్టమైన దాడి"గా కాంగ్రెస్, అకాలీదళ్‌లు మండిపడుతున్నాయి. చండీగఢ్‌ను కొల్లగొట్టేందుకు చేసే ఏ ప్రయత్నమైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలిసి వుంటుందని కాంగ్రెస్, అకాలీదళ్‌లు కేంద్రాన్ని హెచ్చరించాయి.

ఆర్టికల్ 240

చండీగఢ్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 240 పరిధిలోకి తీసుకురావాలన్న కేంద్రం నిర్ణయంపై అధికారిక ఆప్ సహా పలు పార్టీలు మండిపడుతున్న సంగతి తెలిసిందే. డిసెంబర్ 1 నుండి ప్రారంభమయ్యే శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు 2025ను ప్రవేశపెట్టాలని కేంద్రంయోచిస్తున్నట్లు పార్లమెంట్ ప్రకటన తెలిపింది. ఈ ఆర్టికల్ ప్రకారం .. కేంద్రపాలిత ప్రాంతంపై రాష్ట్రపతి నేరుగా నిబంధనలు రూపొందించే అధికారి లభిస్తుంది. పంజాబ్ మరియు హర్యానాకు ఉమ్మడి రాజధానిగా ఉన్న చండీగఢ్‌కి ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ కార్యనిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నారు. 1966లో పంజాబ్ నుండి హర్యానా వేరైన తర్వాత చండీగఢ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించారు. అయితే చండీగఢ్‌ను తమ రాష్ట్రంగా పంజాబ్ ప్రకటిస్తోంది. దీంతో హర్యానాకు ప్రత్యేక రాజధాని కావాలని రాజకీయ నేతలు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తువేళ

హైదరాబాద్, తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్దంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమి డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

# భారత్ కి డేంజర్ బెల్స్ ?

న్యూఢిల్లీ,వర్తమాన యుగంలో అందరూ అత్యధునిక ఆయుధాలతో సిద్ధంగా ఉంటున్నారు. పూర్వం మాదిరిగా సంప్రదాయ యుద్ధాలు అన్నవి లేవు. టెక్నాలజీయే ప్రపంచాన్ని శాసిస్తోంది. ఈ నేపథ్యంలో ఏ దేశమైనా శతవ్గా మారితే కనుక అది ఇబ్బందికరమే అవుతుంది. ఇక శతవు శతృవు తమకు మిత్రుడు అన్న సూత్రంతో మరే దేశమైనా పావులు కదిపితే అది ముప్పేట చిక్కులు తెచ్చే అవకాశాలే ఉంటున్నాయి. ఇపుడు భారత్ విషయంలో మూడు దేశాలు కలసి కట్టిన చేతులు ఏ దిశను నిర్ణయిస్తాయన్నది చర్చనీయాంశం అవుతోంది.

సౌదీ పాక్ తో పెద్దన్న :

ఒక వైపు పాకిస్తాన్ భారత్ కి ఎప్పటి నుంచో దాయాది దేశం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని అయితే లేదు. ఆపరేషన్ సింధూర్ తో పాక్ భారత్ దెబ్బను రుచి చూసిన తరువాత గుణపాఠం నేర్చుకోకపోగా మరింతగా రెచ్చిపోతోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియాతో కొత్త స్నేహం మొదలెట్టింది. ఈ సెప్టెంబర్ లో సౌదీ అరేబియా పాక్ కీలక ఒప్పందాలను చేసుకున్నాయి. ఇపుడు చూస్తే అమెరికా పెద్దన్న కూడా ఈ ఇద్దరితో సై అంటున్నారు. తమకు నాటో దేశాల తరువాత అతి ముఖ్యమైన మిత్ర దేశం సౌదీయే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేయడంతో భారత్ ఈ విషయంలో సీరియస్ గా ఆలోచించాల్సిన పని పడింది అని అంటున్నారు.

అమెరికా భారత్ ల మధ్య :

ఇక చూస్తే కనుక అమెరికా భారత్ ల మధ్యన సంబంధాలు ఇటీవల కాలంలో అంత బాగా లేవు. వరసబెట్టి వాణిజ్య సుంకాలను అధికంగా పెంచడం ద్వారా అమెరికా పెద్దన్న భారత్ ని టార్గెట్ చేస్తూ వస్తున్నాడు. మరో వైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం కూడా అమెరికాకు కన్నెర్రగా మారింది. ఇక భారత్ అయితే అందరితో స్నేహం చేస్తూనే తన అస్తిత్వం కాపాడుకునేందుకే అధిక ప్రాధాన్యత ఇస్తుంది అన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్వేత సౌధం భారత్ మీద ఎందుకో తెలియని కోపంతో గ్యాప్ ని పెంచుకుంటోంది అని అంటున్నారు.

సౌదీ పాక్ ల చెలిమి :

ఇక సౌదీ అరేబియా పాకిస్థాల మధ్య కొత్తగా బలంగా పెరుగుతున్న అనుబంధం కూడా భారత్ ని ఆలోచించుకునే లాగానే చేస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో సౌదీతో కూడా భారత్ కి మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ లో సౌదీ పర్యటన చేపట్టిన ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశంతో అనేక రంగాలలో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. టెక్నాలజీ ఇంధనం తదితర రంగాలలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు కూడా సౌదీ అంగీకరించింది. ఇలాంటి సౌదీ సెప్టెంబర్ నాటికి పాక్ వైపు కొంత మొగ్గినట్లుగా సీన్ అయితే కనిపిస్తోంది. ఇక సౌదీ అరేబియాను పశ్చిమ దేశాలు మరీ ముఖ్యంగా అమెరికా చాలా కాలం పాటు దూరంగా ఉంచింది. గత అధ్యక్షుడు జో బైడెన్ అయితే సౌదీకి పూర్తిగా ఎడం పాటించారు. అయితే ట్రంప్ ఉన్నట్టుండి సౌదీ మిత్ర దేశం అంటూ వేసిన ట్రంప్ కార్డు తో ఇపుడు దక్షిణాసియా దేశాల మధ్య కొత్త రకం సమీకరణలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.

# చండీగఢ్ చుట్టూ కొత్త రాజకీయాలు...



చండీగఢ్ :చండీగఢ్ కేంద్రంగా కొత్త రాజకీయాలు మొదలయ్యాయా? ఆ ప్రాంతాన్ని ఆర్టికల్ 240 తేవాలని కేంద్రం ఆలోచన చేస్తోందా? శీతాకాల సమావేశాల్లో బిల్లు తేవాలని ప్లాన్ చేసిందా? కేంద్రం నిర్ణయాన్ని అధికార ఆప్, విపక్ష కాంగ్రెస్ పార్టీలు తప్పుబడుతున్నాయా? ఈ నేపథ్యంలో కేంద్రం ఎలాంటి అడుగులు వేయనుంది? ఉత్తరాదిలో ఇప్పుడు దీనిపై చర్చ మొదలైంది.

చండీగఢ్ చుట్టూ కొత్త రాజకీయాలు

పంజాబ్-హర్యానా రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధాని చండీగఢ్. అయితే చండీగఢ్ పాలనా బాధ్యతలను పంజాబ్ గవర్నర్ అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే చండీగఢ్ ప్రాంతాన్ని ఆర్టికల్ 240 కిందకు తీసుకురావాలని భావిస్తోంది కేంద్రప్రభుత్వం. అదే చేస్తే ఆ ప్రాంతంపై పంజాబ్ గవర్నర్ పాత్ర బలహీనపడుతుందని అక్కడి ప్రభుత్వం ఆలోచన. ఆ ప్రాంతంపై రాష్ట్రపతి నియంత్రణ పెరుగుతుందని అంచనా వేస్తున్నాయి రాజకీయ పార్టీలు. చండీగఢ్ అధికారంపై డిసెంబర్‌లో జరగనున్న శీతాకాల సమావేశాల్లో బిల్లు తీసుకురావాలని కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కేంద్రం నిర్ణయంపై పంజాబ్‌లోని అధికార-విపక్షాలు భగ్గుమన్నాయి. ఇది ముమ్మాటికీ పంజాబ్ ప్రయోజనాలకు విరుద్ధమని తెగేసి చెబుతున్నాయి. చండీగఢ్ అధికారాలను పంజాబ్ నుంచి తొలగించేందుకు మోదీ సర్కార్ ఈ స్కెచ్ వేసిందని అంటున్నాయి.

కేంద్రం ప్రతిపాదనపై ఆప్-కాంగ్రెస్-అకాలీదల్ పార్టీలు ఆగ్రహం చండీగఢ్ పరిపాలనా స్వరూపాన్ని మార్చేందుకు కేంద్రం రాజ్యాంగ సవరణ ప్రతిపాదన చేయనుంది. దీనికి సంబంధించి 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025ను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భావిస్తోంది. దీనివల్ల చండీగఢ్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 240 పరిధిలోకి తీసుకు రావాలని భావిస్తోంది. ఆర్టికల్ 240 ప్రకారం రాష్ట్రపతికి అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, డామన్ అండ్ దయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా చండీగఢ్‌పై నేరుగా నిబంధనలను రూపొందించే అధికారం దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై భగ్గుమన్నారు పంజాబ్ సీఎం భగవంత్ మాన్. పంజాబ్ రాజధానిని లాక్కోవడానికి కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. చండీగఢ్ నిత్యం పంజాబ్‌లో అంతర్భాగంగా ఉంటుందన్నారు. చండీగఢ్ నిర్మాణానికి మా గ్రామాలను ధ్వంసం చేశారని, దానిపై హక్కు కేవలం మాకు మాత్రమే ఉంటుందని తేల్చిచెప్పారు. దీనిపై వెనక్కి తగ్గేది లేదన్నారు. పంజాబ్‌లోని అధికార ఆప్, విపక్ష కాంగ్రెస్, శిరోమణి అకాలీదల్ పార్టీల నేతలు ఇందుకు ససేమిరా అంగీకరించేది లేదని అంటున్నారు. ఈ సవరణను పంజాబ్ ప్రభుత్వం అనుమతించదని తేల్చేశారు. పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా కేంద్రం ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. చండీగఢ్ పంజాబ్‌కు చెందినది, దానిని లాక్కోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా తీవ్ర పరిణామాలను కలిగి ఉంటుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి దుస్సాహసం చేయకూడదన్నారు. శిరోమణి అకాలీదల్ అధికార ప్రతినిధి దల్జిత్ సింగ్ చీమా ఖండించారు. కేంద్రం ప్రతిపాదనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం శ్రీ గురు తేజ్ బహదూర్ సాహిబ్ 350వ అమరవీరుల వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో కేంద్రం.. పంజాబ్ నుండి చండీగఢ్‌ను వేరు చేయడానికి కుట్ర పన్నుతుందని ఎప్పుడూ ఊహించలేదన్నారు. ఆప్-కాంగ్రెస్-అకాలీదల్ నేతల వాదనను తోసిపుచ్చింది పంజాబ్ బీజేపీ. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ అన్నారు. చండీగఢ్‌ను పూర్తి కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. పంజాబ్ పరిపాలనలో పెట్టుబడిదారులు అనిశ్చితంగానే ఉన్నారని పేర్కొన్నారు. యూటీ హోదాతో కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు.

# అందరికి ఓ ఇల్లు, ఇంటికో బైక్ నా లక్ష్యం : టీవీకే విజయ్

చెన్నై:కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత టీవీకే విజయ్ మొదటి సారి పరిమితమైన కార్యకర్తలతో ప్రచార సభ నిర్వహించారు. కాంచీపురం జిల్లాలో ఓ కాలేజీ మైదానంలో జరిగిన సమావేశంలో విజయ్ ప్రసంగించారు. ఇది బహిరంగసభ కాదు. కానీ మూడు మండలాల నుంచి రెండు వేల మందిని ప్రత్యేకంగా పాసులు ఇచ్చి ఆహ్వానించారు. పోలీసులు భద్రతా కారణాలతో 2,000 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు.

మీడియా, సామాన్య ప్రజలకు ఎంట్రీ అవకాశం ఇవ్వలేదు. దీంతో పరిమిత సంఖ్యలో వచ్చిన పార్టీ మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు. మద్రాస్ హైకోర్టు పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయ సమావేశాలకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించమని ఆదేశించింది. దీంతో పోలీసులు భద్రతా ఆంక్షలు విధించారు. డిసెంబర్ 4న సేలంలో ర్యాలీకి అనుమతి ఇవ్వలేదు. భవిష్యత్ కార్యక్రమాలకు 4 వారాల ముందుగా అనుమతి తప్పనిసరి అని పోలీసులు సూచించారు. కరూర్ ఘటన కారణంగా తన ప్రచారంపై పూర్తి స్థాయి ఆంక్షలు విధించే అవకాశం ఉండటంతో.. 'మీట్ ది పీపుల్' క్యాంపెయిన్ పేరుతో ఇలాంటి సభలు



నిర్వహిస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓటమి ఖాయమని కార్యకర్తలకు విజయ్ భరోసా ఇచ్చారు. డీఎంకే మనకు రాజకీయ ప్రత్యర్థి, బీజేపీ సైద్ధాంతిక ప్రత్యర్థి అని పొత్తులకు అవకాశం లేదని కూడా క్లారిటీ ఇచ్చారు. ప్రజలందరికీ సొంతిళ్లు, ప్రతి ఇంటికి ఒక బైక్ ఉండాలన్నదే లక్ష్యం అని ఎన్నికల హామీల్లో ఒకదాన్ని లీక్ చేశారు. మెల్లగా ప్రజల్లోకి వెళ్లాలని .. జోరు పెంచాలని విజయ్ భావిస్తున్నారు.

# సరుకుల సరఫరాలో రైల్వే రికార్డ్



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న భారత రైల్వే సరుకు రవాణలో దూసుకుపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్ నుంచి నవంబర్ 19 మధ్య కాలంలో ఏకంగా 100 కోట్ల (1 బిలియన్) టన్నుల సరుకు రవాణతో నూతన మైలురాయిని సాధించింది. రైల్వే మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. కేవలం తొమ్మిది నెలల్లోనే 102 కోట్ల టన్నుల సరకులను రవాణ జరిగింది. అత్యధికంగా బొగ్గు 50.5 కోట్ల టన్నుల సరఫరా నమోదయ్యింది. ఆర్థిక సంవత్సరం 2025-26లో నవంబర్ 19 నాటికే రైల్వేలు 1 బిలియన్ టన్నుల (100 కోట్ల టన్నులు) సరుకు రవాణా మార్కును అధిగమించడం విశేషం. గతేడాది రోజుకు 4.2 మిలియన్ టన్నులు (42 లక్షల టన్నులు) సరకు రవాణ నమోదు కాగా.. ఈ ఏడాదిలో సగటున రోజుకు 44 లక్షల టన్నుల సరకు రవాణ జరిగిందని.. రైల్వేల నిర్వహణ సామర్థ్యం పెరిగిందని ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది. గతేడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 90.69 కోట్ల టన్నుల సరుకు రవాణా జరగగా, ఈ సంవత్సరం అదే కాలంలో 93.51 కోట్ల సరుకు రవాణ నమోదయ్యింది. ఇది ఆరోగ్యకరమైన వృద్ధిని సూచిస్తుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. భారతదేశ మౌలిక సదుపాయాల వృద్ధిలో కీలక పాత్రను సిమెంట్ రవాణ సామర్థ్యాలను మరింత పెంచడానికి చర్యలు తీసుకున్నట్లు ఆ శాఖ పేర్కొంది. బల్క్ వస్తువుల రవాణాను రోడ్డు మార్గం నుండి రైలు మార్గానికి మార్చడం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గడంతో పాటుగా అనేక వాణిజ్యేతర ప్రయోజనాలు ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

# కడియం, దానం .. ఎంత కాలం పొడిగిస్తారు?

హైదరాబాద్,స్పీకర్ ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు దానం నాగేందర్, కడియం శ్రీహరి తొందరపడాలనుకోవడం లేదు. మరింత గడువు కావాలని వారు వేర్వేరుగా స్పీకర్ ను కోరుతూ లేఖలు పంపారు. స్పీకర్ ఇచ్చిన నోటీసులకు ఈ సమాధానం ఇచ్చారు. ఎంత గడువు అన్నది బహుశా వారికి కూడా తెలిసి ఉండదు. మిగతా ఎనిమిది మంది విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఓ స్పష్టత ఉంది. స్పీకర్‌కూ ఉంది. అందరి పై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హతా పిటిషన్లను తిరస్కరిస్తారు. కానీ వీరిద్దరిపై మాత్రం తిరస్కరించలేరు. అందుకే వారితో కలపకుండా.. వీరిద్దరి విషయంలో వ్యూహం పాటిస్తున్నారు. కడియం శ్రీహరి కుమార్తె ఎంపీ కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. కానీ కడియం శ్రీహరి తాను కూడా. పార్టీ మారలేదని చెప్పుకోవడానికి చాన్స్ ఉంది. కానీ అలా చేయడానికి ఆయన సిద్ధంగా లేరు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరాననే చెబుతున్నారు. ఉపఎన్నికలకూ సిద్ధమేనని.. ఉపఎన్నికలు వస్తే తానే పోటీ చేస్తానంటున్నారు. కానీ తాను పార్టీ మారిపోయానని మాత్రం స్పీకర్ కు చెప్పడం లేదు. రేవంత్ వ్యూహం ప్రకారం అయన సమాధానం ఇవ్వనున్నారు. ఇక దానం నాగేందర్ విషయంలోనూ అంతే. ఆయన సమయం అడుగుతున్నారు కానీ.. తాను పార్టీ మారలేదని చెప్పలేకపోతున్నారు. చెప్పలేరు కూడా. ఎందుకంటే ఆయన కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన రికార్డు ఉంది. స్పీకర్



కూడా పదిమందిలో ఎనిమిది మంది నిర్ణయాలు తీసుకుని వీరిద్దరి విషయం మాత్రం పెండింగ్ పెట్టే అవకాశం ఉంది. స్పీకర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన చీఫ్ జస్టిస్ గవాయ్ పదవి విరమణ చేస్తున్నారు. నాలుగు వారాల తర్వాత ఈ పిటిషన్లపై విచారణ కొత్త చీఫ్ జస్టిస్ బెంచ్ వద్దకు వెళుంది. అప్పుడు ఎలా స్పందిస్తారన్నదానిపై స్పీకర్ ప్రసాద్ కుమార్ తదుపరి వ్యూహం పాటించే అవకాశం ఉంది.

# కర్ణాటక కొత్త ఐటీ పాలసీ.. తెలుగు రాష్ట్రాల సీఎంలు బీఅలర్ట్!

బెంగళూర్ :భవిష్యత్తును ఎవరైతే సరిగ్గా అంచనా వేస్తారో వారికి తిరుగు ఉండదు. అసాధారణ విజయాల్ని సొంతం చేసుకుంటారు. అసాధ్యాల్ని సుసాధ్యాలు చేస్తారు. ఈ సూత్రం వ్యక్తులకే కాదు వ్యవస్థలకు ఉండాల్సిందే. దేశంలో ఐటీ నగరిగా బెంగళూరు దూసుకెళ్లటానికి కారణం.. దేశంలోని మహానగరాలు ఐటీ భవితను గుర్తించే నాటికే అక్కడి పాలకులు అక్కడ పునాదులు వేయటమే కాదు.. భవనాలు కట్టేశారు. అదే.. బెంగళూరు ఫ్యూచర్ ను మార్చేయటమే కాదు.. ప్రపంచ పటంలో గార్డెన్ సిటీకి సరికొత్త ఇమేజ్ ను తెచ్చి పెట్టింది. ఐటీ విషయంలో నాటి కర్ణాటక పాలకులు ఎంత ముందుచూపుతో వ్యవహరించారో.. నాటి తమిళ ప్రభుత్వాలు ఐటీని.. దాని సత్తాను గుర్తించటంలో వెనుకపడ్డారు. అదే ఈ రోజున చెన్నై మహానగరం ఐటీ విషయంలో ఎంతలా వెనుకబడిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 400 కంటే ఎక్కువ సంస్థలు బెంగళూరులో కార్యకలాపాలు నిర్వహించటం చూస్తే.. నాటి కర్ణాటక పాలకుల విజన్ ఎంతలా పని చేసిందో ఇట్టే చెప్పేయొచ్చు. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాలు మధ్యస్తంగా ఉన్నాయని చెప్పాలి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న వేళలో కర్ణాటక పాలకులంత స్పీడ్ లేకున్నా.. తమిళ ప్రభుత్వాల మాదిరిగానూ లేరు. కాస్త ఆలస్యంగా ఐటీ రేంజ్ ను గుర్తించిన తెలుగు పాలకులు.. ఆ తర్వాత ఆ ఆలస్యాన్ని భర్తీ చేసే ప్రయత్నం చేశారని చెప్పాలి. ఉమ్మడి ఏపీ కాస్తా రెండు తెలుగు రాష్ట్రాలుగా ముక్కలైన వేళ.. హైదరాబాద్ మహానగరి తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉండటంతో ఐటీకి హైదరాబాద్ మహానగరం కేరాఫ్ అడ్రస్ గా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు హైదరాబాద్ మీద పెట్టిన ఫోకస్ మరే నగరం మీదా పెట్టకపోవటంతో.. హైదరాబాద్ లేని ఏపీ ఐటీ విషయంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రంగా మారింది. అయితే.. విశాఖపట్నంలో ఐటీకి అవకాశాలు అంతకంతకూ పెంచుతున్న వైనం.. రానున్న రోజుల్లో ఉక్కునగరంగా పేరున్న వైజాగ్ కు అంతో ఇంతో ఇమేజ్ వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు గూగుల్ డేటా సెంటర్ వైజాగ్ కు వచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ ఒక ఉదాహరణగా చెప్పాలి. ఇప్పటివరకు జరిగింది ఒక ఎత్తు.. ఇకపై జరగాల్సింది మరో ఎత్తుగా చెప్పాలి. ఈ విషయంలో మరోసారి కర్ణాటక ఒక చక్కటి ఉదాహరణగా మారింది. ఐటీ నగరిగా మారిన బెంగళూరు.. ఇటీవల కాలంలో మెరుపుల కంటే మరకలే ఎక్కువగా నమోదవుతున్న పరిస్థితి. దీనికి కారణం.. కొన్ని దశాబ్దాలుగా అక్కడి ప్రభుత్వాలు బెంగళూరు మహానగరంలో మౌలిక వసతుల కల్పన విషయంలో ప్రదర్శించిన అలసత్వం.. ఇప్పుడు గార్డెన్ సిటీకి శాపంగా మారింది. పలు సంస్థలు అక్కడి ట్రాఫిక్ దెబ్బకు దడిచి.. వేరే నగరాలకు వెళ్లిపోతున్న పరిస్థితి. ఇలాంటి వేళ..పూర్తిగా అదుపు తప్పిన బెంగళూరును మళ్లీ గాడిలో పెట్టటం అంత తేలికైన విషయం కాదు. ఈ సందర్భంగా కర్ణాటక పాలకలు కొత్త ఎత్తుగడకు తెర తీశారు. ఇందుకు నిదర్శనంగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త ఐటీ పాలసీ 2025-2030ను ప్రకటించింది. బెంగళూరు టెక్ సమ్మిట్ 28వ ఎడిషన్ ప్రారంభోత్సవంలో ఈ పాలసీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఆసక్తికరంగానే కాదు.. ఆ రాష్ట్ర సరిహద్దుల్ని



పంచుకునే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే అలెర్టు కావాల్సిన అవసరం ఉంది. కొత్త ఐటీ పాలసీలో భాగంగా ప్రకటించిన ప్రోత్సహకాలు సగటు జీవి మొదలు సంస్థల వరకు అందరిని ఆకర్షించేలా ఉండటం దీని ప్రత్యేకతగా చెప్పాలి. ఉదాహరణకు కంపెనీలు నియమించే ప్రతి ఉద్యోగికి రూ.50 వేల వరకు వన్ టైమ్ రీలొకేషన్ ప్రోత్సాహకాన్ని అందిస్తామని ప్రకటించటం. అంటే.. బెంగళూరు నుంచి మైసూరు.. మంగళూరు.. హుబ్లీ-ధార్వాడ్.. కలబురగి.. శివమొగ్గ లాంటి నగరాలకు ఉద్యోగుల్ని తరలించే సంస్థలకు ప్రోత్సహకం ఇస్తామని ప్రకటించింది. ఈ ఆర్థిక ప్రోత్సాహకాల కోసం కర్ణాటక ప్రభుత్వం ఐదేళ్ల వ్యవధిలో రూ.960 కోట్లు ఖర్చు చేయనుండటం గమనార్హం. బియాండ్ బెంగళూరుఅన్న కర్ణాటక సర్కారు వ్యూహంలో 'లీవ్ బెంగళూరు' అన్నది అత్యంత కీలకం. ఈ విషయాన్ని గుర్తించిన కర్ణాటక పాలకులు కొత్త తాయిలాలతో అందరిని ఆకర్షించే ప్యాకేజీని సిద్ధం చేశారు. ఇందులో ముఖ్యాంశాల్ని చూస్తే..

- స్టార్టప్ లు.. టెక్ కంపెనీలు రాష్ట్రంలోని టైర్ 2 నగరాలకు మారితే కోట్ల రూపాయిల సబ్సిడీలు.. పన్ను రాయితీలు లభిస్తాయి.
- అద్దె రాయితీ 50 శాతం. గరిష్ఠ రాయితీ రూ.2 కోట్లు.
- మూడేళ్లు 30 శాతం ఆస్తిపన్ను మినహాయింపు
- ఐదేళ్లు విద్యుత్ ఛార్జీలపై 100 శాతం మినహాయింపు
- కంపెనీలకు ఫోన్. .ఇంటర్నెట్ ఖర్చుల్లో 25 శాతం రాయితీ
- ఏఐ.. బ్లాక్ చెయిన్.. క్వాంటం కంప్యూటింగ్ లాంటి రంగాల్లో పరిశోధనలపై పెట్టే ఖర్చులో 40 శాతం రీఫండ్
- ఉద్యోగంలో భాగంగా బెంగళూరు నుంచి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు (మైసూరు.. మంగళూరు.. కలబురగి)కు మారేందుకు ఉద్యోగులు మొగ్గు చూపితే.. వారికి రూ.50 వేల ప్రోత్సహకాన్ని అందవేత. ఈ కొత్త ఐటీ పాలసీ ఐటీ కంపెనీలు ఎలా స్పందిస్తాయి? అన్నది ఒకటైతే.. రెండు తెలుగు రాష్ట్రాలు సైతం కర్ణాటక ఆలోచనల్లోని మర్మాన్ని గుర్తించి.. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లోనూ ఈ తరహా ప్రోత్సాహకాల్ని అందించే దిశగా ఐటీ పాలసీల్ని సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నది మర్చిపోకూడదు. అదే భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాలు మిగిలిన రాష్ట్రాల కంటే ముందుండేలా చేస్తాయని చెప్పక తప్పదు.

# మీ దగ్గర ఓట్లు ఉంటే నా దగ్గర నిధులున్నాయ్.. అజిత్ పవార్ సంచలనం



ముంబై:మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం కొలువు తీరి ఉన్న సంగతి తెలిసిందే. ఆర్థిక మంత్రిగా ఎన్సీపీకి చెందిన అజిత్ పవార్ వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆ రాష్ట్రంలోని బారామతి జిల్లా మాలెగావ్ నగర పంచాయితీ ఎన్నికలు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని నగర పంచాయితీలకు ఎన్నికలు డిసెంబరు 2న జరుగుతున్న నేపథ్యంలో పార్టీలు ప్రచారాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాయి. తాజాగా రాష్ట్ర ఆర్థిక మంత్రి కం ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రచారానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. తమ పార్టీకి చెందిన ఎన్సీపీ అభ్యర్థులు పద్దెనిమిది మంది ఉన్నారని.. వారిని ఎన్నుకుంటే నిధుల కొరత అనేది ఉందని.. మొత్తం పద్దెనిమిది మందినీ ఎన్నుకుంటే తాను ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటిని నెరవేరుస్తానని.. అదే సమయంలో తమ అభ్యర్థుల్ని తిరస్కరించే పక్షంలో తాను నిధులు ఇవ్వనని ఓపెన్ గా చెప్పేశారు. "మీ వద్ద ఓట్లు ఉంటే.. నా దగ్గర నిధులు ఉన్నాయి" అంటూ ఓటర్లకు వార్నింగ్ ఇచ్చిన వైనం ఇప్పుడు సంచలనంగా మారింది. అజిత్ పవార్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోక్లిప్ వైరల్ గా మారింది. ఈ తీరును విపక్షాలు మండిపడుతున్నాయి. చివరకు సంకీర్ణ ప్రభుత్వంలో మిత్రపక్షం సైతం ఈ వ్యాఖ్యల్ని తప్పు పడుతున్నాయి. ఉద్ధవ్ వర్గానికి శివసేనకు చెందిన నేత అంబదాస్ స్పందిస్తూ.. పవార్ తీరును తప్పు పట్టారు. నిధులు అజిత్ పవార్ ఇంటి నుంచి రావని.. సామాన్యులు చెల్లించే పన్నుల నుంచి వస్తాయన్న విషయాన్ని మర్చిపోకూడదంటూ.. "పవార్ లాంటి నాయకుడు ఓటర్లను బెదిరిస్తుంటే.. ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది" అని ప్రశ్నించారు. ఓటర్ల మనసు దోచుకోవటానికి బదులుగా.. ఓపెన్ గా వార్నింగ్ ఇస్తున్న అజిత్ పవార్ లాంటి నేతలపై ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తారా.. గాలికి వదిలేస్తారా?

హైదరాబాద్,హైదరాబాద్ 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగానే తెలుసు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టింది. గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసింది. రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య తగ్గించింది. ఇక రక్షణ విషయంలోనూ అనేక చర్యలు చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. కానీ, రెండేళ్లలో హైదరాబాద్‌కు ఆయన పెద్దగా చేసింది ఏమీ కనిపించడం లేదు.

సగం ఆదాయం హైదరాబాద్ నుంచే..

తెలంగాణకు విశ్వనగరం హోదా వచ్చినా.. రాష్ట్రానికి సగం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తున్నా.. నగర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఐటీ రంగం, ఇతర పరిశ్రమలు మరియు సేవలు నగర అభివద్ధిని ముందుకు నడిపిస్తున్నాయి. కోటి జనాభా దాటిన హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులే 10 లక్షల మంది ఉన్నారు. వీరిపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 15 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. అయినా నగరం గడిచిన రెండేళ్లలో పెద్దగా అభివృద్ధి చెందిన దాఖలాలు కనిపించడంలేదు. ఇటీవలి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ నగర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు.

ట్రాఫిక్ తిప్పలు..

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ప్రతిపాదనలు ఉన్నా, కార్యాచరణలో అందుబాటులోకి రావడం లేదు. ముఖ్యంగా నానల్ నగర్ ట్రై జంక్షన్, బేగంపేట, రసూల్పురా వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో కొత్త ఫ్లైఓవర్‌లు, రోడ్డు విస్తరణలకు ప్రతిపాదనలు చేసినా, నిర్మాణ పనులు ప్రక్రియలోనే ఉన్నాయి.

నామమాత్రపు కేటాయింపులు..

రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ రోడ్డులకు కేవలం రూ.2,654 కోట్లు మాత్రమే కేటాయించారు. నీరు, డ్రెయినేజి, మెట్రోతో సహా ఇతర పనులకు



మరో రూ.6 వేల కోట్లు కేటాయించారు. కానీ ఉచిత పథకాలకు రూ.లక్ష కోట్లు కేటాయించారు. హైదరాబాద్ రోడ్లకన్నా 'కళ్యాణలక్ష్మి', 'షాదీముబారక్' వంటి పథకాలకు ఎక్కువ నిధులు రూ.3,683 కోటుల కేటాయించారు.

కనీస సదుపాయాల కొరత

నగరంలో 24 గంటలు తాగునీరు కల్పించడం, రెయిన్ వరదలు, మెట్రో విస్తరణ వంటి ప్రాధాన్య అంశాల్లో ఆచరణలో పురోగతి లేదు, ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తర్వాత ప్రజల్లో అభివృద్ధికి కొత్త ఆశలు వెలిగాయి. రాబోయే మూడేళ్లలో అయినా ప్రభుత్వం సమగ్ర దృష్టితో హైదరాబాద్‌ను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆదాయ కేంద్రమైన హైదరాబాద్ పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. నూతన మౌలిక సదుపాయాలు, మెట్రో విస్తరణ, రోడ్డు పనులు, కనీస సేవలు పై ప్రత్యేక దృష్టి పెట్టితే, నగరం బంగారు బాతుగుడ్డు నుంచి ప్రజల నిండైన అనుభవానికి మారుతుంది. కొత్తగా మరో 10 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పరోక్షంగా మరో పది లక్షల మంది ఉపాధి పొందుతారు. కంపెనీలు హైదరాబాద్‌కు తరలి వస్తాయి. లేదంటే బెంగళూరులా మారిపోతుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com